

ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్లే అధికం.. -6లో



టీడీపీ అభ్యర్థులకు చంద్రబాబు బీ ఫారాలు

పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో పోటీ చేసే ఎన్‌డీఏ కూటమిలోని టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఆదివారం అమరావతిలో బీ ఫారాలు అందజేశారు. అందుకున్న వారిలో ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ (ఏలూరు), ఎమ్మెల్యే అభ్యర్థులు.. ఆరిమిల్లి రాధాకృష్ణ (తణుకు), పితాని సత్యనారాయణ (ఆచంట), నిమ్మల రామానాయుడు (పాలకొల్లు), రఘు రామకృష్ణంరాజు (ఉండి), సొంగా రోషన్‌కుమార్ (చింతలపూడి), కొలుసు పార్థసారథి (నూజివీడు), బడేటి చంటి (ఏలూరు) ఉన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారికి దిశా నిర్దేశం చేశారు.





భీమవరం సభలో మాట్లాడుతున్న జనసేనాని పవన్ కల్యాణ్, చిత్రంలో ఉండి, భీమవరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు రఘురామకృష్ణరాజు, పులపర్తి రామాంజనేయులు, ఎంపీ అభ్యర్థి వర్మ, టీడీపీ, జనసేన జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, చినబాబు, మల్లినీడి బాబి తదితరులు

అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా

ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించండి : జనసేనాని పవన్‌కల్యాణ్

భీమవరం/నరసాపురం/నరసాపురం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించండి. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా. కోనసీమలో రైలు కూత వేస్తే.. అది నరసాపురంలో వినిపించేలా చేస్తా. ఉభయగోదావరి జిల్లావాసులకు చిరకాల స్వప్నంగా మిగిలిన వారధి నిర్మాణం పూర్తయ్యేలా బాధ్యత తీసుకుంటా. హార్బర్ నిర్మించి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతా. లేసు పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొస్తా' అంటూ జనసేనాని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, భీమవరం పట్టణాల్లో ఆదివారం రాత్రి రోడ్ షోలు నిర్వహించి, అనంతరం భారీ బహిరంగ సభల్లో మాట్లాడారు. రెండుచోట్ల మూడు పార్టీల శ్రేణులతోపాటు పవన్ అభిమానులు తరలి రావడంతో పట్టణాల రహదారులు జన సంద్రంగా మారాయి. పవన్ మాట్లాడుతూ 'గత ప్రభుత్వ హయాంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిన ఆక్వా రంగం జగన్ హయాంలో నిర్లక్ష్యానికి గురైంది. మేం అధికారంలోకి రాగానే ఈ రంగాన్ని మెరుగు పరుస్తాం. మత్స్యకారుల జీవితా ల్లో కొత్త వెలుగులు నింపే బాధ్యత నాది. మరుగున పడిన సొసైటీలకు పూర్వ వైభవం తీసుకుని వస్తా. భీమవరానికి రింగు రోడ్డు, అవసరమైన వంతెనలను ఏర్పాటు చేస్తాం. తాగునీటి అవసరాలు తీరుస్తాం. వీరవాసరం మండలంలో తాగు, సాగు నీటి సమస్యలు లేకుండా చూస్తాం' అని భరోసా ఇచ్చారు. '2019 ఎన్నికల్లో వచ్చినప్పుడు ఆరోగ్యం బాగోలేదు. అప్పుడు మీరంతా చూపిన ప్రేమ, అభిమానం ఎప్పటికి మరిచిపోను. మా అన్న చిరంజీవి వైఎన్ కాలేజీలో చదివి మెగాస్టార్ అయ్యాడు. ఎన్‌సీసీలో గ్రూప్ కెప్టెన్‌గా ఉండి, రిపబ్లిక్ పేరడ్‌కు వెళ్లాడు. మా ఇంట్లో ఈ ఫొటోలు ఇంకా చెరగని ముద్రలు. మీరు నాకు చేయాల్సిందల్లా ఒక్కటే ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి' అని కోరారు. 'వారధి నిర్మించకపోతే ఇంటికి వచ్చి ఓటు అడగనని ఎమ్మెల్యే ప్రసాదరాజు శపథం చేశారు. ఈ ఎన్నికల్లో ఆయన ఓటు అడిగితే మీరు నిలదీయండి. తనకు ఓటు వేయలేదని ముదునూరి ఒక కులంపై కక్ష కట్టి కేసులు పెట్టించి, 40 మంది అధికారులను బదిలీ చేయించడం దారుణం.ఒక కులాన్ని టార్గెట్‌గా చేసి కేసులు పెట్టించడం సరికాదు' అని అన్నారు. 'భీమవరానికి రౌడీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రౌడీ మూకలతో పాలన చేస్తున్నాడు. హామీలు నెరవేర్చలేదు. భీమవరం నుంచి 2019లో పోటీ చేసినప్పుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు తిట్టకూడదంటూనే నా పార్టీ వారే చెప్పారు. అలా చేస్తే కాపులు ఓట్లు పడవు, ఇలా చేస్తే ఇతరులు ఓట్లు పడవని నీరసం తెప్పించారు. అయినా నేను భీమవరం నుంచి పారిపోలేదు. ఇది నా గుండెల్లో ఉంది. ఇప్పుడు మంచి మనిషి, గుండెలనిండా ధైర్యమున్న నాయకుడు అంజిబాబు పోటీ చేస్తున్నారు. భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత మాది' అంటూ పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మకు కమలం గుర్తు పైన, భీమవరం ఎమ్మెల్యే అభ్యర్థి అంజిబాబుకు గ్లాస్ గుర్తుపైన, ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణంరాజుకు సైకిలు గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు.



నరసాపురం సభలో ఐక్యత చాటుతున్న పవన్, నేతలు



భీమవరం సభలో మాట్లాడుతున్న పవన్

ఆ రెండింటిపై పవన్ అస్త్రం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఏలూరు జిల్లాలో పార్టీ కూటమి పక్షాన దక్కిన రెండు అసెంబ్లీ స్థానాలను గెలుచుకునేందుకు జనసేనాధిపతి పవన్ కల్యాణ్ పక్కా ప్రచారం చేయాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారు. ఉంగుటూరు, పోలవరం నియోజకవర్గాల్లో ఆయన విస్తృత పర్యటనకు సిద్ధమయ్యారు. ఉంగుటూరు నియోజకవర్గంలో పార్టీ పక్షాన ఉమ్మడి కూటమి తరపున పోటీకి దిగిన పత్సమట్ల ధర్మరాజు సుదీర్ఘంగా నియోజకవర్గంలో ప్రచారం సాగిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గం అండదండలు ఉండేలా ఆయన జాగ్రత్త పడుతుండగా ఈ నియోజకవర్గంలోనే పర్యటించి కూటమి అభ్యర్థికి మరింత ఆత్మస్థైర్యం పెంచేలా జనసేనాని పవన్ కల్యాణ్ సోమవారం ఇక్కడ పర్యటించనున్నారు. పోలవరం నియోజకవర్గంలోనూ పార్టీకి మరింత ఊపిరి పోసేందుకు ఆ నియోజకవర్గంలోనూ పవన్ పర్యటించాలని భావిస్తున్నారు. అందుకనే ఆయన ఈ నెల 30వ తేదీన ఒక రోజు అంతా ఈ నియోజకవర్గంలో విస్తృత ప్రచారానికి సిద్ధమవుతున్నారు.

నేడు గణపవరంలో పవన్ కల్యాణ్ పర్యటన

ఉంగుటూరు : ఉంగుటూరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం ఆరు గంటలకు గణపవరం పోలీస్ దిమ్మ వద్ద జనసేనాని పవన్ కల్యాణ్ వారాహి వాహనంపై నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఉంగుటూరు కూటమి జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. తాడేపల్లిగూడెం సభ అనంతరం పిప్పర మీదుగా గణపవరం చేరుకుంటారని నియోజక వర్గ సమస్యలపై ఆయన మాట్లాడతారన్నారు.

దెందులూరు ఎవరిది?

- ఈ నియోజకవర్గంలో రోజుకో సీరియల్ కథ
- రకరకాల సంకేతాలతో కేడర్ విలవిల
- చింతమనేనికే సీటు ఖాయమంటూ టీడీపీ వర్గాల ధీమా
- మాకే ఛాన్స్ ఉంటుందంటూ బీజేపీ హడావుడి
- ఆదివారం బీ-ఫాం అందుకోని చింతమనేని..
- నేడు కూటమి నాయకత్వం కీలక నిర్ణయం



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

తెలుగుదేశం అభ్యర్థులకు ఆదివారం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు బీ-ఫాం అందజేశారు. నియోజకవర్గాల్లో ప్రచారంలో ఎలాంటి మెలకువలు పాటించాలో గీతోపదేశం చేశారు. ఇంకొందరికి అదనంగా సూచనలు ఇచ్చారు. అయితే వారం రోజులుగా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న దెందులూరు స్థానం నుంచి ఎవ్వరికి బీ-ఫాం ఇవ్వలేదు. ఈ నియోజక వర్గం నుంచి దఫదఫాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు బీ-ఫాం ఇవ్వకపోవడంతో టీడీపీ కార్యకర్తలు తీవ్ర నిరాశ చెందారు. ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారని, ఇక్కడ నుంచి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనా చౌదరి పోటీ చేస్తారని వారం రోజులుగా పెద్ద దుమారం చెలరేగుతోంది. దీంతో ఈ స్థానం చింతమనేనిదా.. తపనా చౌదరిదా? అన్న సందిగ్ధత మధ్యనే ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలు ఉత్కంఠతో ఉన్నారు.

అసలు ఇంతకీ ఏమైంది..

దెందులూరు నియోజకవర్గంలో తిరుగులేని నేతగా, చాలా కాలం నుంచి పార్టీనే అంటిపెట్టుకుని మాస్‌లో మంచి ఇమేజ్ ఉన్నఉన్న చింతమనేని ప్రభాకర్‌కు ఈ మధ్య చిక్కులు ఎదురవుతున్నా ఇప్పటికే ప్రచారంలోనూ, నామినేషన్ దిశగా ముందడుగులు వేస్తూ వచ్చారు. గ్రామ గ్రామనా పార్టీ కేడర్‌ను ఉత్తేజపరుస్తూ సమాంతరంగా పార్టీలో కొత్తగా చేరుతున్న వారిని అక్కున చేర్చుకుంటున్నారు. వైసీపీకి దీటుగా బదులిచ్చే విధంగా ఆయన వ్యూహం కొనసాగుతూ వచ్చింది. తెలుగుదేశంలో తిరుగేలేదనుకున్న చింతమనేని పోటీకి సిద్ధంగా ఉన్న నియోజకవర్గం దెందులూరులో ఆకస్మికంగా మార్పులు జరగబోతున్నాయంటూ వచ్చిన సంకేతాలు కేడర్‌లో తీవ్ర ఆగ్రహాన్ని, అసంతృప్తిని కలిగించింది. నియోజకవర్గంలో పార్టీకి అడుగడుగునా తిరుగులేని నాయకత్వం, గ్రామగ్రామాన కార్యకర్తల బలం ఉంది. ఎంపీపీ నుంచి ఎమ్మెల్యేగా ఎదిగిన ప్రభాకర్ ఒక్క దెందులూరే కాకుండా ఇరుగుపొరుగు నియోజక వర్గాలపైన తన ప్రభావం చూపిస్తారు. ఆయన అభిమానులంతా ఆయన ఎటు చెప్తే అటు నడుస్తారు. అలాంటి నియోజక వర్గాన్ని బీజేపీ ఆశిస్తున్నట్టు సమాచారం బయటకు పొక్కింది. బీజేపీ అనపర్తి నియోజకవర్గంతో ముడిపెట్టి ఆ స్థానాన్ని తెలుగుదేశం తిరిగి తీసుకోదలిస్తే ఉంగుటూరు లేదా దెందులూరు తమ పార్టీకి కేటాయించాలని తేల్చిచెప్పింది. ఏలూరు ఎంపీ స్థానాన్ని ఆశించిన తపనా చౌదరిని సంతృప్తి పరిచేందుకు బీజేపీ కేంద్రపెద్దలు, రాష్ట్రనాయకత్వం టీడీపీ నాయకత్వంపై తీవ్ర ఒత్తిడి చేసింది. తెలుగుదేశం ఇప్పటికే ఉంగుటూరు స్థలాన్ని జనసేనకు కేటాయించినందున మార్పులు, చేర్పులు ఉండవని జనసేనాని పవన్ తెగేసి చెప్పారు. ఇక మిగిలింది దెందులూరు కావడం, తపనా చౌదరికి ప్రత్యామ్నాయంగా ఏదో ఒక సీటు కాకుండా దెందులూరు కోసమే బీజేపీ కట్టుబడుతూ వచ్చింది. మూడురోజులుగా అయితే ఈ విషయం మరింత ముదిరి దెందులూరు స్థానం టీడీపీ చేతిలోనే ఉంటుందా? లేక? బీజేపీకి మళ్ళుతుందా? అనే విషయంలో సందిగ్ధత నెలకొంది. చింతమనేని సోమవారం నామినేషన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం అమరావతికి వచ్చి బీ-ఫాం అందుకోవాల్సిందిగా పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సంకేతం వచ్చింది. దీంతో చిక్కుముడి వీడిందని ప్రభాకర్‌తో పాటు ఆయన అనుచర గణమంతా సంతృప్తి పడింది. ఇదే క్రమంలో బీజేపీ నుంచి కూడా తపనా చౌదరికి ఒక్కరోజు ఆగండి నిర్ణయం మనవైపే ఉంటుంది మిగిలిన ఏర్పాట్లు చేసుకోండి అంటూ సంకేతాలు వెల్లువడ్డాయి. ఆదివారం చింతమనేని ప్రభాకర్‌కు తప్ప రాష్ట్రంలో మిగతా తెలుగుదేశం అభ్యర్థులందరికీ చంద్రబాబు బీ-ఫాంలు అందజేశారు. దీంతో మళ్ళీ దెందులూరు నియోజక వర్గంపై టీడీపీ కేడర్‌లో అనుమానపు పొర ఏర్పడింది. మరోవైపు చింతమనేని దెందులూరులో పోటీ చేసేలా చంద్రబాబు సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ గట్టిగా పట్టుబట్టారు. ఈ వివాదం ఆదివారం తేలిపోతుందని అంతా భావించినా మరోసారి నిర్ణయం వాయిదా పడింది. టీడీపీ సీనియర్లు అంతా దెందులూరు చింతమనేనికి ఖాయం అవుతుందని, తొలుత తీసుకున్న నిర్ణయం మారబోదని చెబుతూనే వస్తున్నారు. అనపర్తి నియోజకవర్గ సమస్య ఆదివారం ఒక్క కొలిక్కి వచ్చింది. దీంతో దెందులూరు సస్పెన్స్‌కు సోమవారం తెరపడబోతుందని చెబుతున్నారు. ఇదే తరుణంలో బీజేపీ నిర్ణయం కూడా అమల్లోకి వస్తుందనే ఆశతో తపనా చౌదరి ఉన్నారు.

నేడు కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ నామినేషన్



ఏలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కనీవినీ ఎరుగని రీతిలో భారీ మద్దతుదారులతో ఏలూరులో ర్యాలీ చేసి నామినేషన్ దాఖలు చేసేందుకు కూటమి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ సిద్ధమవు తున్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆయన సోమవారం తన నామినేషన్‌ను ఏలూరు కలెక్టరేట్‌లో సమర్పించనున్నారు. పార్టీ కేడర్‌తో పాటు కూటమి భాగస్వామి పార్టీలైన జనసేన, బీజేపీ నుంచి భారీసంఖ్యలో కార్యకర్తలు, నేతలు మహేష్ నామినేషన్ మహోత్సవానికి తరలిరావాలని ఇప్పటికే నిర్ణయించారు. ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి పెద్దసంఖ్యలో ఏలూరులో జరిగే ర్యాలీలో పాలుపంచుకోవాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఎంపీ కూటమి ముఖ్యులందరికీ ఆహ్వానాలు అందజేసి నామినేషన్ సమయంలో అందరి ఆశీర్వాదం తనకు అందించాలని కోరారు. ఎన్నికల నిబంధనలకు లోబడే ఏలూరులో పెద్దఎత్తున ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేసేలా టీడీపీ అన్ని ఏర్పాట్లు చేసింది. సోమవారమే వివిధ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు నామినే షన్లు దాఖలు చేస్తున్నందున సాధ్యమైనంత మేర ఎంపీ అభ్యర్థి మహేష్ నామి నేష న్‌కు కూడా హాజరయ్యేలా వారు సమయాన్ని సర్దుబాటు చేసుకున్నారు.

నాలుగో రోజు నిల్..

- నేడు రోషన్, చింతమనేని నామినేషన్లు దాఖలు

ఏలూరు సిటీ/చింతలపూడి/జంగారెడ్డిగూడెం/పెదవేగి, ఏప్రిల్ 21 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్లకు ఆదివారం సెలవు కావడంతో నాలుగో రోజు ఎవరూ వేయలేదు. ఇప్పటి వరకు ఏలూరు పార్లమెంట్ స్థానానికి మూడు, దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 21 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల గడువు మరో నాలుగు రోజుల్లో గురువారంతో ముగియనుంది. కూటమి తరపున ఉండి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు, చింతలపూడి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్, దెందులూరు నుంచి చింతమనేని ప్రభాకర్ సోమవారం నామినేషన్లు దాఖలు చేస్తారు. కైకలూరు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ 23న నామినేషన్ వేస్తారు.

ఈ ఎన్నికలు నాకు.. జగన్‌కు

ఎంపీ, ఉండి ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణరాజు

కాళ్ళ, ఏప్రిల్ 21 : ఈ అసెంబ్లీ ఎన్నికలు నాకు సీఎం జగన్‌కు, గోదావరి ప్రజలకు.. కడప రెడ్లకు జరుగుతున్నాయి. గోదావరి జిల్లాల ప్రజల పౌరుషాన్ని నిరూపించాల్సిన సమయం ఆసన్నమైంది' అని నరసాపురం ఎంపీ, ఉండి అసెంబ్లీ నియోజకవర్గ కూటమి తరపున టీడీపీ అభ్యర్థి కనుమూరి రఘురామ కృష్ణరాజు ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాళ్ళ మండలం జక్కరంలో ఆదివారం ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మంతెన రామరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఈ నెల 22న టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు ఆధ్వర్యంలో ఉండి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉండిలో గెలిచి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు కానుకగా ఇద్దామన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉండికి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉంటారన్నారు. ఎవరైనా ఇప్పుడు పార్టీలోకి చేరితే వారిని ఆహ్వానిద్దామన్నారు. మంతెన రామరాజు మాట్లాడుతూ 'పార్టీ అధినేత చంద్రబాబు నన్ను పిలిచి కుటుంబ పెద్దగా నిన్ను అడుగుతున్నాను. కాదనకుండా సహకరించాలి. ఉండి టిక్కెట్‌ను రఘురామకృష్ణరాజుకు కేటాయించాలని కోరడంతో కాదనలేకపోయా'నని అన్నారు.



నరసాపురం ఎంపీ, ఉండి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజుతో ఎమ్మెల్యే మంతెన రామరాజు ముచ్చట్లు

ఓటుహక్కును వినియోగించుకోండి..

- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 21 : జిల్లాలో మే 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలలో ఓటు వేసే అవకాశాన్ని ఓటుహక్కు కలిగిన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ కోరారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో ఇది ప్రధాన కర్తవ్యమన్నారు. 2019 ఎన్నికల కన్నా 2024 ఎన్నికల్లో ఓటింగ్ శాతం మరింత పెరగాలని ఆయన ఆకాంక్షించారు.

చెల్లింపు వార్తలపై నిబంధనలు గమనించాలి

ఎన్నికల సమయంలో చెల్లింపు వార్తలపై జర్నలిస్టిక్ ప్రవర్తన నిబంధనలను పాటించాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రింట్ మీడియాకు చేసిన సూచనలను ఆదివారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వివరించారు. ఏదైనా మీడియాలో (ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్) కనిపించే ఏదైనా వార్త నగదు లేదా వస్తువు విశ్లేషణ పరిగణలోకి తీసుకుంటే దానిని చెల్లింపు వార్తలుగా నిర్ధారించవచ్చు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఎన్నికల సమయంలో పెయిడ్ న్యూస్ పబ్లికేషన్‌లకు దూరంగా ఉండడానికి ప్రింట్ మీడియాకు పలు మార్గదర్శకాలను రూపొందించిందన్నారు. చెల్లింపు వార్తలపై ఈ నిబంధనలను గమనించాలని ప్రింట్ మీడియాకు ఆయన సూచించారు.

గాలివాన..బీభత్సం

వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో విరిగిపడ్డ చెట్లు.. విద్యుత్ స్తంభాలు.. నిలిచి పోయిన విద్యుత్ సరఫరా

నేలరాలిన మామిడి...రైతుల ఆవేదన



తిరుమలాపురంలో విరిగిపడ్డ కరెంటు స్తంభాలు

కుక్కునూరు/వేలేరుపాడు, ఏప్రిల్ 21 : కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఆదివారం గాలివాన దుమారం బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం వరకు భానుడి భగభగలతో అల్లాడి పోయిన జనానికి తొలుత వర్షం ప్రారంభంతో కొంత ఉపశమనం లభించినా వర్షంతో పాటు గాలి బీభత్సంగా వీచడంతో బెంబేలెత్తారు. కుక్కునూరు మండలంలోని ఇసుకపాడు, లంకాలపల్లి గ్రామాల్లో వేగంగా వీచిన గాలికి రహదారి పక్కనే ఉన్న చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరాకి అంతరాయం కలిగింది. స్థానికులే కొన్నిచోట్ల విరిగిన చెట్ల కొమ్మలను తొలగిం చారు. గాలికి మామిడి కాయలు నేలరాలడంతో రైతాంగం నష్టపోయారు. వేలేరుపాడు మండలం తిరుమలాపురంలో చెట్లతో పాటు విద్యుత్ స్తంభాలతో విరిగి కింద పడ్డాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. మేడేపల్లి వద్ద వృక్షాలు విరిగి రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వేలేరుపాడు-రుద్రమకోట, వేలేరుపాడు-కొయిదా రహదారిపై భారీ వృక్షాలు నేలకూలడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలకు మరింత ఇబ్బందులు పడ్డారు.





మేడేపల్లిలో నేలకూలిన వృక్షం.. కుక్కునూరు-అశ్వారావుపేట రహదారి మధ్యలో విరిగిపడిన చెట్ల కొమ్మలు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లా అధికారి జె.శ్రీనివాస్



కావ౦వరపుకోట, ఏప్రిల్ 21 : ఎన్నికల నిబంధనలను అంతా పాటించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లా అధికారి జె.శ్రీనివాస్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో కొత్తూరు ఆర్‌అండ్‌బీ బంగ్లా నాలుగు రోడ్ల కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టును ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, పలు వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు వాహనాలలో వస్తువులు, నగదు తరలిస్తుంటే అడ్డుకట్ట వేసేందుకే ఎక్కడికక్కడ చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఈ చెక్‌పోస్టులో ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించడం వల్ల 20 మంది నుంచి పెద్దమొత్తంలో నగదు స్వాధీనం చేసుకుని ట్రెజరీలకు జమ చేశామన్నారు. చెక్‌పోస్టు అధికారి ఎం.డి. మొహిద్దీన్, ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌ఐ కె.శేషారెడ్డి, హెచ్‌సీ కె.రమేష్, కె.రామకృష్ణ, జి.సూర్యారావు, గోవర్ధన్, శ్రీనివాస్, వీరమల్ల మధు తదితరులు ఉన్నారు.

జగన్మాయ

మట్టి మాఫియా


అక్రమ తవ్వకాలతో తరిగిపోతున్న పోలవరం కుడికాలువ గట్టు

దెందులూరు నియోజకవర్గం నాలుగు మండలాల విభిన్న భౌగోళిక స్వరూపం. దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ పరిధిలో కొన్ని గ్రామాలు డెల్టా, మెట్ట, కొల్లేరు ప్రాంతాల సమ్మిళితం. పెదవేగి మండలం పూర్తిగా మెట్ట ప్రాంతం. దెందులూరు సగం మెట్ట, సగం డెల్టా. పెదపాడు మూడొంతులు డెల్టా, మిగిలిన ప్రాంతం మెట్ట. ఏలూరురూరల్ గ్రామాలు కొల్లేరుకు అనుసంధానంగా ఉన్నాయి. కొల్లేరు కాంటూరు కుదింపు హామీ అమలు కాలేదు. పెదపాడు మండల భూములకు సాగు నీరు హామీ గాలికొదిలేశారు. పెదపాడు మండలంలో మట్టి మింగేస్తున్నారు. అడిగివారిపై దాడులు, అక్రమ కేసులతో భయపెడుతున్నారు. దెందులూరు - పంగిడిగూడెం రహదారి విస్తరణ, జాతీయ రహదారిపై కొమిరేపల్లి వద్ద ఫుట్‌పాత్ వంతెన, సర్వీసు రోడ్డు నిర్మాణ హామీలు అమలుకు నోచుకోలేదు. - పెదవేగి



- హామీలు గాలికొదిలేశారు
- మట్టినీ మింగేస్తున్నారు
- అభివృద్ధి జాడే లేదు
- అందని సాగు నీరు

దెందులూరు నియోజకవర్గంలో అధికార వైసీపీ నేతల దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలను ప్రశ్నిస్తున్న ప్రజలు, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. గత జనవరి 30న రాత్రి పెదవేగి మండలం లక్ష్మీపురం సమీపంలో పోలవరం కుడి కాలువ గట్టును తవ్వేస్తూ, మట్టిని తరలిస్తుండగా అడ్డుకున్న టీడీపీ నాయకులపై ఎమ్మెల్యే అనుచరులు దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. టీడీపీ నాయకులు తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలైనా దాడిచేసిన వారి సమాచారం ఇచ్చినా కేసు మాత్రం నమోదు కాలేదు.

పెదపాడు మండలం అప్పనవీడు, కలపర్రు సాగునీటి చెరువుల్లో అనధికార మట్టి తవ్వకాలతో లక్షలాది రూపాయల నగదు నేతల చేతుల్లోకి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ఏపూరు చెరువులో నీటిపారుదల, గనుల శాఖల అనుమతులున్నాయని అధికార పార్టీ నేతలు పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు చేపట్టి ప్రైవేటు వ్యక్తుల స్థలాల మెరక పనులకు వినియోగించారు. అడ్డుకున్న ప్రతిపక్ష నేతలపై బెదిరింపు కేసులు నమోదయ్యాయి. మట్టి తవ్వకాలపై కూడా కోర్టులో కేసులు నమోదు చేశారు.

ఏలూరు సమీపంలోని వంగాయగూడెం నుంచి కృష్ణా జిల్లా సరిహద్దు పెరికీడు వరకు సీసీ రహదారి నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఈ మార్గంలో కల్వర్టులు మినహా సీసీ రహదారుల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. అరకొర నిర్మించిన రహదారిపై ప్రయాణానికి పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారు.


పంట పొలంగా మారిన కాలువ గట్టు


గుడివాకలంకలో చేపల చెరువుల మధ్య జగనన్న కాలనీ

నెరవేరని జగన్ హామీలు

పెదవేగి, గార్లమడుగు, జగన్నాధపురం, కవ్వగుంట, సూర్యారావుపేట తదితర గ్రామాల్లో వేసవిలో సాగునీటి ఎద్దడి సర్వసాధారణం. పోలవరం కుడికాలువనుంచి ఎత్తిపోతలద్వారా నీటిని సూర్యారావుపేట సమీపంలో ఏర్పాటు చేసిన మినీ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోయడానికి అనువుగా గత ఏడాది మే 25న ముఖ్యమంత్రి జగన్ దెందులూరులో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. జగన్నాధపురం దగ్గర పోలవరం కుడికాలువపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసేందుకు రూ.68.85 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం జగన్ ప్రకటించారు. ఇప్పటికీ పునాది రాయి కూడా పడలేదు.

వేసవిలో లంక గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రతరం. నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కానీ అమలు చేయలేదు. తమ్మిలేరుకు వరద పోటెత్తితే దిగువ గ్రామాల్లో పంట పొలాలు నీట మునుగుతున్నాయి. పంట కోత సమయంలో రైతులు పంట మొత్తం నష్టపోతున్నారు. ముంపు సమస్య పరిష్కారం హామీ ఇప్పటికీ అమలు కాలేదు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమలకు దెందులూరు - పంగిడిగూడెం రహదారి దగ్గరి మార్గం. వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారి విస్తరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పనులు చేపట్టి, మధ్యలోనే వదిలేశారు. జాతీయ రహదారిపై కొమిరేపల్లి వద్ద ఎక్కువగా ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. కొమిరేపల్లికి చెందిన పలువురు గ్రామస్తులు మృత్యువాత పడ్డారు. ఆ ప్రాంతంలో ఫుట్‌పాత్ వంతెన లేదా సర్వీస్ రోడ్డు నిర్మాణం హామీ అమలుకు నోచుకోలేదు.

పోలవరం కుడి కాలువ నుంచి కృష్ణా కాలువకు నీరందిస్తామని ఇచ్చిన హామీ అతీగతీ లేదు. పెదపాడు మండలంలో సాగునీటి ఎద్దడి తీరనే లేదు. దాళ్వా సీజన్‌కు గోదావరి కాలువ ద్వారా పులిచింతల ప్రాజెక్టు వద్ద నీటి స్టోరేజీని ఉంచి, పూర్తిస్థాయిలో నీరందించి రైతాంగాన్ని ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం, ఆ దిశగా మాత్రం అడుగులు ముందుకేయలేదు. కృష్ణా డెల్టా ఆయకట్టులో ఖరీఫ్ (సార్వా)లో సుమారుగా 50 వేల ఎకరాల్లో పంట సాగు చేస్తుండగా రబీలో 30 వేల ఎకరాలకు తగ్గిపోయింది.

జగనన్న ఇళ్లు ఏవీ..

జగనన్న కాలనీల్లో పేదలకు సొంత ఇల్లు అనిన గొప్పలు చెప్పారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి 20.77 ఎకరాల్లో 800 మందికి స్థలాలు కేటాయించారు. శ్రీపర్రు 10 ఎకరాల్లో 413 మంది, మానూరు 1.86 ఎకరాల్లో 64 మంది, పైడిచింతపాడు 3.87 ఎకరాలు 147 మందికి స్థలాలు కేటాయించారు. ఎక్కడా ఒక్క నిర్మాణం చేపట్టలేదు. పాలగూడెం, గుడివాకలంక, ప్రత్తికోళ్ళలంక గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో ఒక్క ఇంటికి కూడా పునాది పడలేదు. శ్రీపర్రు, జాలిపూడి, మాదేపల్లి, మల్కాపురం, మొండికోడు గ్రామాల్లో ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం గమనార్హం.


జానంపేటలో సర్వే రాళ్లకే పరిమితమైన జగనన్న కాలనీ



స్మార్ట్.. ప్రచారం

పోలింగ్ సమయం దగ్గర పడుతోంది. రాజకీయ నేతలు, కార్యకర్తలు, పోటీలో ఉన్న అభ్యర్థులు హైరానా పడుతున్నారు. ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. అంతేనా.. పోలింగ్ అయ్యేవరకు ఓటర్లను అంటిపెట్టుకుని ఉండాలంటే.. వారికి సోషల్ మీడియా ఉపయోగపడుతోంది. మొబైల్, ఇంటర్నెట్ వాడకం పెరగడంతో పార్టీలు, నేతలకు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యేక ప్రచార వ్యూహాలు రూపొందించారు. సోషల్ మీడియా ప్రచారంలో నేతల ఊకదంపుడు ఉపన్యాసాలు ఉంటేనే సరిపోదు, జనంలోకి దూసుకువెళ్లే స్థాయి కంటెంట్ అవసరం. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ జనాలకు ఇదొక నిత్యావసరం. రాజకీయ పార్టీలకు నేతలకు అదే వరంగా మారింది. ప్రజలకు వేగంగా చేరాలంటే వేగవంతమైన వేదిక మరొకటి లేదు. ఎన్నికల వేళ ఆన్‌లైన్ వేదికలపై ఎన్నికల సంగ్రామం సాగుతోంది. అధికార, విపక్షాలు ఓటర్‌ను చేరేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. నేతలంతా సోషల్ మీడియాలో తిష్టవేశారు. దీంతో ఎన్నికల ప్రచారం కొంత పుంతలు తొక్కుతోంది. యువ ఓటర్ నాడిపట్టేందుకు ఎన్నికల బరిలో నిలిచిన ఆయాపార్టీల అభ్యర్థులు ప్రత్యేక దృష్టిసారించారు. తెలుగుదేశం, వైసీపీ అభ్యర్థులు ఒకరిపై ఒకరు మాటల తూటాలను ఎక్కుపెడుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్‌లలో ఓ రేంజ్‌లో హంగామా చేస్తున్నారు. వైసీపీ కూడా టీడీపీతో దీటుగా ఆన్‌లైన్ వేదికలను ఉపయోగించుకుంటోంది. స్వతంత్రులు, ఇతర పార్టీల వారు సామాజిక మాధ్యమాను ఉపయోగించుకుంటున్నారు. పార్టీల ఎన్నికల ప్రణాళిక అభ్యర్థులతో పాటు ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషల్‌మీడియా ద్వారా ప్రచారం చేస్తూ ఓటర్ల మనసు గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. సవాళ్ళు, ప్రతిసవాళ్ళతో తమ పోస్టులను కొంతపుంతలు తొక్కిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా యువతను ఆకర్షించి ఓట్లు దండుకోవడం ఇప్పుడు ట్రెండ్‌గా మారింది.

- ఏలూరు కలెక్టరేట్



హలో.. నేను మీ అభ్యర్థిని !


ఫోన్ రింగ్ అయితే కంగారే.. పొలిటికల్ కాల్స్‌తో కంగారు వస్తోంది. ఎన్నికల వేళ ఓటర్లను ఆకర్షించేందుకు అసెంబ్లీ, పార్లమెంట్ బరిలో ఉన్న అభ్యర్థులు ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టీవ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) వాయిస్‌కాల్, ఎస్ఎంఎస్‌పై ఆధారపడ్డారు. వారి నియోజకవర్గంలోని ఓటర్ల జాబితా ఆధారంగా వ్యక్తిగత ఫోన్ నెంబర్లు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలను సేకరించారు. వీటి ద్వారా ఓటర్లను ఫోన్‌లో పలుకరిస్తున్నారు.

హలో నేను మీ అభ్యర్థిని, అసెంబ్లీ స్థానంలో పోటీ చేస్తున్నాను మీ అమూల్యమైన ఓటువేసి నన్ను గెలిపించాలని అభ్యర్థిస్తున్నానంటూ ఒక పక్క అభ్యర్థులు, మరోవైపు పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్‌మోహన్‌రెడ్డి మాటలు ఓటర్లకు వినిపిస్తున్నారు. ఎన్నికల ప్రచారం కోసం ఫోన్‌కాల్ కాకుండా ఎస్ఎంఎస్ కూడా చేస్తున్నారు. కొందరు ఎన్నికల ప్రచారం పాదయాత్ర, రోడ్‌షోలతో ప్రజలను ఆకట్టుకుంటే మరికొందరు ఐవీఆర్ఎస్ సిస్టమ్‌ను వినియోగించుకుంటున్నారు. ఓట్లను అభ్యర్థించడం వరకు ఓటర్లు సహనంతో ఉంటున్నారు. అధికార పార్టీ ఆగడాలు అంటూ కొన్ని సంఘటనలు వివరించడం, ప్రతిపక్షాలపై అధికార పార్టీ విరుచుకుపడడం కూడా ఫోన్‌లోనే.. ఏదో ఫోన్ కాల్ వచ్చిందని తీస్తే ఒక్కసారిగా రాజకీయ పార్టీ ఎన్నికల పాటలు వినిపించడంతో ఓటర్లు ఉసూరుమంటున్నారు. ఇలా మొబైల్ ఫోన్ల ద్వారా ప్రచారం సాగుతోంది. ఓటర్లకు కొత్త కొత్త నెంబర్ల నుంచి ఫోన్‌లు వస్తుండటం, నాయకుల వాయిస్‌తో ఫోన్ రావడం చర్చనీయాంశంగా మారింది. అవి ముందుగానే రికార్డుచేసిన కాల్స్ అని తెలిసిన వారు మాత్రం లైట్‌గా తీసుకుంటున్నారు. కాని సాంకేతిక విషయాలు తెలియని గ్రామీణ ఓటర్లు మాత్రం తోటివారితో నాకు చంద్రబాబు, జగన్ నుంచి ఫోన్‌లు వస్తున్నాయని చెప్పుకుంటున్నారు. తమకు కూడా వస్తున్నాయని ఒకరితో ఒకరు చెప్పుకుంటున్నారు. పొలిటికల్ కాల్స్‌తో కొంత సరదా.. కొంత చికాకు తప్పడం లేదు.

- ఏలూరు రూరల్

మహిళ సత్తా

అంతా ఆమె ఇష్టం..



ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

భీమవరం టౌన్, ఏలూరు సిటీ

ఉమ్మడి జిల్లాలో జనాభా, ఓటర్లలో మహిళలదే పైచేయి. రాజకీయంగా కూడా వారిదే సగం వాటా.. జిల్లాల విభజన అనంతరం పశ్చిమ గోదావరి జిల్లా 2022 ఏప్రిల్ 4న ఏర్పడినప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం 19 మండలాలలో జనాభా 17,80,321 మంది. మొత్తం జనాభాలో మహిళలు 11,200 మంది అధికంగా ఉన్నారు. 2024 జనవరి 22న ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో అత్యధిక ఓట్లు మహిళలవే. జిల్లాలో ఓటర్లు 14,61,338 నమోదు కాగా, పురుషులు 7,16,956 మంది, మహిళా ఓటర్లు 7,44,308 మంది నమోదయ్యారు. థర్డ్‌జెండర్ ఓటర్లు 74 మంది ఉన్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలలో భీమవరంలో అత్యధికంగా మహిళా ఓటర్లు ఉండగా నరసాపురంలో అత్యల్పం. ఏలూరు జిల్లాలో ఓటర్ల తుది జాబితా ఆధారంగా మొత్తం ఓటర్లు 16,24,416 మంది కాగా పురుష ఓటర్లు 7,93,897 మంది, మహిళా ఓటర్లు 8,30,390 మంది ఉన్నారు. జిల్లాలో మహిళా ఓటర్లు 36,493 మంది అధికంగా ఉన్నారు. ఇతర ఓటర్లు జిల్లాలో 129 మంది ఉన్నారు. అంతేకాదు ఉమ్మడి జిల్లాలోజనాభాలో కూడా పురుషుల కంటె మహిళలే అధికం.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు
భీమవరం	1,21,884	1,29,172
ఉండి	1,09,501	1,13,797
తణుకు	1,13,768	1,19,420
తాడేపల్లిగూడెం	1,04,059	1,09,160
ఆచంట	88,383	90,603
పాలకొల్లు	95,75	98,757
నరసాపురం	84,125	85,074
చింతలపూడి	1,33,747	1,37,714
పోలవరం	1,22,201	1,30,380
నూజివీడు	1,17,398	1,19,730
ఏలూరు	1,10,254	1,20,423
దెందులూరు	1,08,465	1,14,305
ఉంగుటూరు	1,01,152	1,04,177
కైకలూరు	1,00,680	1,03,661

మహిళా ఓటర్ల శాతం గణనీయంగా ఉండడంతో రాజకీయ పార్టీలు కూడా తమ మేనిఫెస్టోలలో మహిళా సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. వారి ఓట్లకు గాలం వేయడానికి ప్రధాన రాజకీయ పార్టీలు వారికి ఎన్నో పథకాలను వర్తించేలా మేనిఫెస్టోలను రూపొందించుకున్నాయి.

తార్.. మార్..

చింతలపూడి రాజకీయ సిత్రం

వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కాంగ్రెస్ అభ్యర్థి
కూటమి నుంచి బరిలో కొత్త అభ్యర్థి

చింతలపూడి నియోజకవర్గంలో రాజకీయ వ్యూహాలు పదునెక్కుతున్నాయి. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడంతో అధికార పార్టీ సొంత ఎమ్మెల్యేపైనే వివక్ష చూపిందని ఓటర్లు చెప్పుకుంటున్నారు. 2014 ఎన్నికల్లో చింతలపూడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన పీతల సుజాత మంత్రిగా కూడా చేశారు. అనంతర పరిణామాల్లో ఆమె మంత్రి పదవి కోల్పోయారు. 2019 ఎన్నికల్లో ఆమెకు టీడీపీ తిరిగి సీటు కేటాయించలేదు. కర్రా రాజారావు టీడీపీ తరపున పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో ఉన్నమట్ల ఎలీజా వైసీపీ తరపున పోటీ చేసి గెలుపొందిన ప్రస్తుత ఎన్నికల్లో ఆ పార్టీ సీటు కేటాయించలేదు. దీనితో ఎలీజా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. - చింతలపూడి

పార్టీ మారిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజా



2019 ఎన్నికల్లో ఎస్సీ టీడీపీ అభ్యర్థిగా కర్రా రాజారావు పోటీపడగా, వైసీపీ అభ్యర్థిగా ఐఆర్ఎస్ ఉద్యోగి ఉన్నమట్ల రాకాడ ఎలీజా పోటీచేసి 36వేల ఓట్ల మెజార్టీ సాధించారు. ఆయన ఐఆర్ఎస్ అధికారిగా పనిచేస్తూ నాలుగేళ్ల ముందుగానే వీఆర్ఎస్ తీసుకుని ఏడాది ముందుగా వైసీపీలో చేరి పార్టీలో పలు కార్యక్రమాలు చేపట్టి 2019 ఎన్నికల్లో విజయాన్ని అందుకున్నారు. 2024 ఎన్నికల్లో సర్వేలో ఎలీజా గెలవలేరంటూ నాలుగు నెలల ముందుగానే ఇన్‌చార్జ్‌లను పెట్టడం, వైసీపీ టిక్కెట్ నిరాకరించడంతో ఆయన చాలా బాధ, అవమానకరంగా భావించారు. బలమైన వర్గం మాటలు విని తనను తప్పించారని, పెత్తందారుల వైపు జగన్ మొగ్గు చూపారంటూ ఆయన ధ్వజమెత్తారు. పార్టీలో కొనసాగుతూ అవమానాలు భరించలేక కాంగ్రెస్ టిక్కెట్ సాధించి ఎన్నికల్లో తన సత్తా చూపుతానంటున్నారు.

ఆచంట నుంచి బదిలీపై వచ్చి..

2004లో ఆచంట ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి పీతల సుజాత గెలుపొందారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఆచంట జనరల్ కావడంతో ఆమెకు అవకాశం లభించలేదు. 2014లో చింతలపూడి నియోజకవర్గానికి బదిలీ అయ్యారు. చింతలపూడి నుంచి వైసీపీ తరపున మహిళా అభ్యర్థి బి.దేవిప్రియపై పీతల సుజాత టీడీపీ తరపున పోటీ చేసి గెలుపొందారు. స్త్రీ శిశు సంక్షేమం, గనుల శాఖా మంత్రిగా పనిచేశారు. తర్వాత ఆమె మంత్రి కోల్పోవడంతో పాటు 2019 ఎన్నికల్లో సీటు పొందలేదు.


పీతల సుజాత

నవతరం ఓటర్

ఉపాధి కల్పించే నాయకుడు కావాలి



రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించే నాయకత్వం పరిపాలనలో ఉండాలని నా అభిప్రాయం. ఉచిత విద్య వైద్యం, ప్రజలకు అందిస్తే ప్రజలకు ఎనలేని మేలు జరుగుతుంది. జనాకర్షణ పథకాల వల్ల ఉపయోగం లేదు. అన్నిస్థాయిల్లో పెరిగిన అవినీతిని అరికడితేనే రాష్ట్రం, దేశాభివృద్ధి సాధ్యం.

-పలగాని త్రినాథ్, జనార్ధనవరం

ఉద్యోగావకాశాలు కల్పించాలి



త్వరలో డిగ్రీలు పొంది, బయటకు రానున్న నాలాంటి యువతకు ప్రస్తుతం ఈ రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు లేవు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, వ్యవసాయరంగం, ఐటీరంగాన్ని సమన్వయపరుస్తూ రాష్ట్రాన్ని స్వయం సిద్ధంగా ఆదాయం పొందే విధంగా తీర్చిదిద్దే నాయకత్వాన్ని కోరుకుంటున్నాం.

- పి.యశస్వి, ముసునూరు

ఐటీ రంగం వృద్ధి చెందాలి



రాష్ట్రంలో ఐటీరంగం వృద్ధిచెందాలి. అలా జరిగితేనే యువతకు స్థానికంగా ఉద్యోగాలు లభిస్తాయి. అలాగే యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపడాలంటే పారిశ్రామికరంగం కూడా అభివృద్ధి చెందాలి. ఈ రంగాలను అభివృద్ధి పరిచే ప్రభుత్వం రావాలి. మెరుగైన ఉన్నత విద్య ఉపాధి కావాలి.

- జి.దినేష్, ముసునూరు

అభివృద్ధి కావాలి



రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, వ్యవసాయరంగాన్ని సంయుక్తంగా అభివృద్ధి చేసే నాయకుడు కావాలి. యువత ఇతర రాష్ట్రాలకు వలసపోతోంది. గ్రామాల్లో ఇప్పటికీ 70శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వం దృష్టిసారించి రైతులకు మేలుచేస్తేనే దేశంలో పేదరిక నిర్మూలన జరుగుతుంది.

- ఓగిరాల కార్తీక్, చాట్రాయి

రికార్డు..రికార్డు !

వరుసగా ఐదుసార్లు విజయం

ఉండి నుంచి రికార్డు సృష్టించిన అబ్బాయిరాజు



ఉండి, ఏప్రిల్ 21: కలిదిండి రామచంద్రరాజు(అబ్బాయిరాజు) ఎమ్మెల్యే వరుసుగా ఐదుసార్లు గెలిచి రికార్డు సృష్టించారు. డబుల్ హ్యాట్రిక్‌కు జస్ట్ మిస్ అయ్యారు. తెలుగుదేశం పార్టీ తెలుగుదేశం పార్టీ స్థాపించినపుడు నందమూరి తారక రామా రావు ఉండి మండలం పెదపుల్లేరు గ్రామానికి చెందిన సామాన్య రైతు కుటుంబానికి చెందిన కలిదిండి అబ్బాయిరాజును పిలిచి ఉండి అసెంబ్లీ నుంచి పోటీ చేయాలని సీటు ఇచ్చారు. టీడీపీ అభ్యర్థిగా 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా ఐదు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా, టీటీడీ ఛైర్మన్‌గా, ఇతర పదవుల్లో పనిచేశారు.

ఇద్దరు వలంటీర్ల సస్పెన్షన్

లింగపాలెం, ఏప్రిల్ 21: లింగపాలెం మండలంలో ఇద్దరు వలంటీర్లను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో రాంబాబు తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వలంటీర్లు వైసీపీ అభ్యర్థి వేస్తున్న నామినేషన్ కార్యక్రమానికి ఇద్దరు వలంటీర్లు హాజరయ్యారని ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడినట్లు అభియోగాలు రావడంతో పరిశీలించి వలంటీర్లను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.



వాహనాల తనిఖీలు..3.50 లక్షలు సీజ్

ఏలూరు క్రైం/ ఉంగుటూరు, ఏప్రిల్ 21 : ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లజాము వరకూ జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. కలపర్రు, ఉంగుటూరు టోల్‌గేట్‌ల వద్ద తనిఖీలను నిర్వహించారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా రూ. 11,790 విలువైన 36.2 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో మూడు లక్షల 50 వేలు నగదు సీజ్ చేసినట్టు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. ఉంగుటూరు టోల్‌ప్లాజా వద్ద తణుకు నుంచి ఏలూరు వైపు వెళుతున్న వల్లూరి సుధాకర్ కారు నుంచి అనుమతి లేని నగదు రూ.లక్ష స్వాధీనం చేసుకున్నారు.



రఘురామ కృష్ణరాజు ప్రచార రథం రెడీ

ఉండి, ఏప్రిల్ 21: కనుమూరు రఘురామకృష్ణరాజు ప్రచార రథం సిద్ధమైంది. హైదారాబాద్ నుంచి అన్ని హంగులతో రెడీ అయిన వాహనం చిన అమిరంలోని ఆయన కార్యాలయం వద్ద సిద్ధంగా ఉంది. రఘురామ కృష్ణరాజు కుమారుడు భరత్‌వర్మ ఆదివారం పరిశీలించారు.ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా అమరావతిలో బి-ఫాం తీసుకున్న రఘురామకృష్ణరాజుకి ఉండి నియోజకర్గం లోని ఉప్పుటూరు వద్ద ఘన స్వాగతం లభించింది. ఈనెల 22న ఉదయం 11 గంటలకు ఉండి రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. అందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. తదుపరి ప్రచారం రథంలో గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు.

భీమవరం పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది ఆక్వా.. రెండు దశాబ్దాలుగా ఆక్వా రాజధానిగా ప్రఖ్యాతి గాంచింది. పట్టణం వేగంగా అభివృద్ధి చెందింది.విజయవాడ, హైద్రాబాద్ వంటి సిటీలలో ఉండే సౌకర్యాలు భీమవరం పట్టణంలో అందుబాటులో ఉంటాయి. దీంతో భీమవరం పట్టణాన్ని ఖరీదైన పట్టణంగా చెబుతారు. కార్ల షోరూమ్‌ల దగ్గర నుంచి మల్టీప్లెక్స్ థియేటర్‌లు, హైక్వాలిటీ షోరూమ్‌లు ఇక్కడ కొలువుదీరాయి.

- భీమవరం రూరల్

భీమవరం పట్టణం వ్యూ



ఫ్లాష్ బ్యాక్

ఆక్వా రాజధాని



2004లో భీమవరం నియోజకవర్గంలో పాలకోడేరు మండలాన్ని ఉండి నియోజకవర్గంలోకి, పాలకొల్లు నియోజకవర్గంలో ఉన్న వీరవాసరం మండలం భీమవరం నియోజకవర్గంలో కలపడంతో రాజకీయ సమీకరణాలు మారాయి. కాపు ఓట్లు ఎక్కువగా ఉండడంతో ఆ సామాజికి వర్గానికి ప్రాధాన్యం పెరిగింది. దీంతో 2004లో కాంగ్రెస్ నుంచి గ్రంధి శ్రీనివాస్‌ను నిలబెట్టగా విజయం సాధించారు. అప్పటినుంచి కాపు అభ్యర్థులనే నిలబెడుతూ వస్తున్నారు. 2009లో కాంగ్రెస్ నుంచి పులపర్తి రామాంజనేయులు గెలిచారు. రాష్ట్ర విభజన తరువాత జరిగిన పరిణామాలతో 2014లో ఆయన టీడీపీలోకి వెళ్లిపోయారు. ఆ పార్టీ అభ్యర్థిగా మరోసారి గెలిచారు. 2019 ఎన్నికలలో ముక్కోణపు పోటీలో ముగ్గురు కాపు వర్గానికి చెందిన వారు పోటీ పడ్డారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, వైసీపీ నుంచి గ్రంధి శ్రీనివాస్, టీడీపీ నుంచి పులపర్తి రామాంజనేయులు పోటీ పడ్డారు. గ్రంధి శ్రీనివాస్ విజయం సాధించారు.

భీమవరం నియోజకవర్గం

మొత్తం ఓటర్లు : 2 లక్షల 51 వేల 065
పురుషులు : 1 లక్షా 21 వేల 844
మహిళలు : 1 లక్షా 29 వేల 172
49 మంది ఇతరులు ఉండగా యువ ఓటర్లు 5603 మంది, సీనియర్ సిటిజన్స్ 1286 మందిఉన్నారు.

ఖరీదైన పట్టణంగా పేరు
షాపింగ్ మాల్‌లతో కళ కళ..
ఆక్వా రంగంతో ఆర్థికంగా అభివృద్ధి
విద్యా, వైద్య సౌకర్యాల్లో ప్రగతి

రెండో సారి గెలిచిన గ్రంధి శ్రీనివాస్..

భీమవరం నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ పవన్‌కల్యాణ్‌పై విజయం సాధించారు. శ్రీనివాస్ 8,357 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. పవన్‌కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించి 2014లో పోటీ చేయలేదు. 2019లో ఆయన పార్టీ అభ్యర్థులను నిలబెట్టారు. భీమవరంలో పదిహేను సార్లు ఎన్నికలు జరగ్గా కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ ఒకసారి, కాంగ్రెస్ మూడుసార్లు, కాంగ్రెస్-ఐ నాలుగుసార్లు, టీడీపీ ఐదుసార్లు గెలిచాయి. వైసీపీ ఒకసారి గెలుపొందింది.

ఇక్కడ ఏ పార్టీ విజయమో.. ప్రభుత్వం ఏర్పాటు అదే

భీమవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తాడో ఆ పార్టీనే ప్రభుత్వం ఆనవాయితీగా మారింది. 3 దశాబ్దాలు వెనక్కి చూస్తే 1994లో పీవీ నరసింహరాజు తెలుగుదేశం అభ్యర్థిగా విజయం సాధించారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. 1999లో పీవీ నరసింహరాజు విజయం సాధించారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. 2004లో కాంగ్రెస్ తరుపున గ్రంధి శ్రీనివాస్ విజయం సాధించగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, 2009లో పులపర్తి రామాంజనేయులు కాంగ్రెస్ నుంచి విజయం ఆ పార్టీనే ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2014లో పులపర్తి రామాంజనేయులు టీడీపీ తరపున గెలుపొందగా టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. 2019లో గ్రంధి శ్రీనివాస్ వైసీపీ పార్టీ విజయం సాధించగా అదే ప్రభుత్వం ఏర్పాటైంది.



సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
2019	గ్రంధి శ్రీనివాస్	వైసీపీ	పవన్‌కళ్యాణ్	జనసేన	8,357
2014	పి.రామాంజనేయులు	టీడీపీ	గ్రంధి శ్రీనివాస్	వైసీపీ	13,726
2009	పి.రామాంజనేయులు	కాంగ్రెస్-ఐ	సూర్యనారాయణరాజు	ప్రజారాజ్యం	22,099
2004	గ్రంధి శ్రీనివాస్	కాంగ్రెస్-ఐ	పీవీ నరసింహరాజు	టీడీపీ	7,905
1999	పీవీ నరసింహరాజు	టీడీపీ	వి.రామకృష్ణంరాజు	కాంగ్రెస్-ఐ	31,854
1994	పీవీ నరసింహరాజు	టీడీపీ	భూపతిరాజు కస్తూరి	కాంగ్రెస్-ఐ	6,655
1989	అల్లూరి సుభాష్‌చంద్రబోస్	కాంగ్రెస్-ఐ	పీవీ నరసింహరాజు	టీడీపీ	3,374
1985	పీవీ నరసింహరాజు	టీడీపీ	బీఎస్‌వీ రామేశ్వరరావు	కాంగ్రెస్-ఐ	32,815
1983	పీవీ నరసింహరాజు	టీడీపీ	వి.రామకృష్ణంరాజు	కాంగ్రెస్-ఐ	41,188
1978	కేవీ నరసింహరాజు	కాంగ్రెస్-ఐ	ఎమ్.పద్మనాభం	జనతా	15,230
1972	బి.విజయ్‌కుమార్‌రాజు	కాంగ్రెస్	వై.వెంకట్రామరాజు	ఇండి	4006
1967	బి.విజయ్‌కుమార్‌రాజు	ఇండిపెండెంట్	నాచు వెంకట్రామయ్య	కాంగ్రెస్	9,207
1962	నాచు వెంకట్రామయ్య	కాంగ్రెస్	వై.పొలిశెట్టి	సీపీఐ	3,367
1955	నాచు వెంకట్రామయ్య	కాంగ్రెస్	వై.పొలిశెట్టి	సీపీఐ	3,197
1952	బి.సుబ్బరాజు	కెఎంపీపీ	ఎస్.సంగయ్య	కాంగ్రెస్	24,128

ఆక్వా కేంద్రంగా..

ఉమ్మడి జిల్లాలలోనే భీమవరం నియోజకవర్గం ఆక్వా హబ్‌గా పేరు గాంచింది. రాష్ట్రంలోనే రొయ్యల ఎగుమతుల ద్వారా అత్యధిక ఆదాయం పొందుతోంది. రొయ్యల ఎగుమతులకు ప్రధాన కేంద్రంగా నిలిచింది. ఉమ్మడి జిల్లాలలో ఏడాదికి ఆక్వా రంగం నుంచి రూ.24 వేల కోట్లు వరకు ఆదాయం వస్తుంది.

విద్యా, వైద్య రంగంలో ప్రగతి

భీమవరం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన విద్యా సంస్థలు ఉండటం వలన విద్యా రంగంలో ప్రసిద్ధిగాంచిన పట్టణంగా నిలిచింది. దశాబ్దాలు కలిగిన డిగ్రీ విద్యా సంస్థలు ఇంజనీరింగ్‌లో ప్రసిద్ధిగాంచిన కళాశాలలు ఉండటంతో ఎక్కువ ప్యాకేజీ ఉద్యోగాలను భీమవరం విద్యార్థులు పొందగలుగుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు భీమవరం పట్టణంలో విద్యను అభ్యసించడానికి ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. భీమవరం పట్టణంలో వైద్య రంగంలోను ప్రసిద్ధి గాంచింది. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వైద్యం అందుబాటులో ఉండటం, మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు, ఇటు క్యాన్సర్ వైద్యం నుంచి ప్రత్యేక గుండె వైద్యం ఆసుపత్రులు కూడా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. పంచారామ క్షేత్రాల్లో ఒకటైన గునుపూడి సోమేశ్వరాలయం, ప్రసిద్ధి గాంచిన మావుళ్లమ్మ ఆలయాలతో ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతంగా ఖ్యాతి గడించింది.



ఎన్నికల వేళ..మార్కెట్ డీలా

పోలింగ్ పూర్తయిన తర్వాతే మార్కెట్‌కు కళ !



పాలకొల్లు, ఏప్రిల్ 21 : ఎన్నికల వేళ మార్కెట్‌లు వెలవెలబోతున్నాయి. వేసవి కాలం ఆరంభం కావడంతో ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు ఇలా అన్ని రకాల గృహోపకరణాలను ఆయా షాపులలో పెద్ద ఎత్తున తెచ్చి పెట్టుకున్నారు. అయితే వేసవి మొదలైనప్పటికీ బోణీ కావడం లేదని వర్తకులు గగ్గోలు పెడుతున్నారు. ఎందుకని ఆరా తీస్తే వచ్చే నెల 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓటుకు వెయ్యి నుంచి ఐదు వేలు వరకూ ఇస్తారని ప్రచారం జరుగుతున్నది. ఎంపీ అభ్యర్థులు కూడా ఎంతో కొంత ఇచ్చే అవకాశం ఉందన్న ప్రచారం పెద్దగా జరుగుతున్నది. ఒక కుటుంబంలో నాలుగు ఓట్లు ఉంటే సుమారు కనిష్టంగా రూ.12 వేలు, గరిష్టంగా రూ.20 వేలు వస్తాయని లెక్కలు వేసుకుంటున్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత 14వ తేదీ నుంచి వర్తక సముదాయాలు కళకళలాడతాయని వర్తకులు అంచనాలు వేసుకుంటున్నారు. ఇప్పుడైతే మార్కెట్‌లో వ్యాపారాలు లేవు...పేద మధ్య తరగతి ప్రజల చేతుల్లో సొమ్ములు లేవు. ఎన్నికల వేళ మే, జూన్ నెలల్లో అమ్మకాలు పెరుగుతాయని వర్తకులు భావిస్తున్నారు. 2019 ఎన్నికల సమయంలో వస్త్ర దుఖాణాలు, వివిధ కమోడిటీల వ్యాపార సముదాయాలు, జ్యూయలరీ షాపులు కళకళలాడాయి. ఇప్పుడు కూడా అదే విధంగా ఉంటుందని వర్తకులు అంచనాలు వేస్తుండగా వచ్చిన సొమ్ముతో ఏం కొనుగోలు చేయాలా అని పలువురు ఇప్పటి నుంచే ముచ్చటించుకుంటున్నారు.

నేడు తాడేపల్లిగూడెంలో పవన్ సభ

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 21 :జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం తాడేపల్లిగూడెంలో పర్యటించనున్నారు. పట్టణంలో జీవీ మాల్ సమీపంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. భీమవరం నుంచి పెంటపాడు మండలం ప్రత్తిపాడు ఎన్‌కే గ్రౌండ్‌కు సాయంత్రం 4.30 గంటలకు పవన్‌కల్యాణ్ హెలికాప్టర్‌పై చేరుకుంటారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా ప్రత్తిపాడు బైపాస్ జంక్షన్, ప్రత్తిపాడు వై.జంక్షన్, జువ్వలపాలెం, తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్, తాలూకా సెంటర్ మీదుగా బహిరంగ సభ నిర్వహించే ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగిస్తారు. అనంతరం తాడేపల్లిగూడెం నుంచి రోడ్డు మార్గంలో గణపవరం చేరుకుంటారు. అక్కడి నుంచి భీమవరం చేరుకుని రాత్రి బస అక్కడ చేస్తారు. తాడేపల్లిగూడెం బహిరంగ సభ విజయవంతం చేయాలని నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జిలు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.బహిరంగ సభ జరిగే ప్రాంగణాన్ని పరిశీలించారు.



తాడేపల్లిగూడెంలో పవన్ కల్యాణ్ బహిరంగ సభ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్, వలవల బాబ్జి

నరసాపురం, భీమవరంలలో ఘనస్వాగతం

నరసాపురం రూరల్, ఏప్రిల్ 21: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఆదివారం స్వర్ణాంధ్ర కళాశాలలో హెలిప్యాడ్‌లో ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రి కొత్తపల్లి, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, జనసేన అభ్యర్థి నాయకర్, బీజేపీ అభ్యర్థి వర్మ, టీడీపీ, బీజేపీ కన్వీనర్లు పొత్తూరి రామరాజు, మేకల సతీష్, చాగంటి చిన్న, కలవకొలను తాతాజీ, స్వర్ణాంధ్ర ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ తదితరులు స్వాగతం పలికారు. షెడ్యూల్ ప్రకారం పవన్ సాయంత్రం 3 గంటలకు రావాల్సి ఉంది. అయితే 5 గంటలకు చేరుకున్నారు. అప్పటికే కాలేజీ ప్రాంగణం అంతా జనసేన, కూటమి పార్టీల నాయకులతో నిండిపోయింది. పవన్ హెలికాప్టర్ దిగగానే కేరింతలు కొట్టారు. అక్కడ నుంచి రాత్రి 6.15 గంటలకు రోడ్డు మార్గంలో మెయిన్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకున్నారు. పవన్‌ను చూడగానే మహిళలు, యువత, అభిమానులతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. సీతారాంపురం నుంచి నరసాపురం వరకు రోడ్డుకు ఇరువైపులా పెద్దసంఖ్యలో పవన్‌ను చూసేందుకు మహిళలు, అభిమానులు మధ్యాహ్నం నుంచి ఎండలో నిరీక్షించారు.



మీ ఆరోగ్యం.. జాగ్రత్త అంటూ యువతి బ్యానర్



సభా ప్రాంగణం వద్ద యువత కేరింతలు



దూరం నుంచే హారతిలిస్తూ..





భీమవరం సభలో పవన్ కల్యాణ్‌తో అంజిబాబు

భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

కూటమి అభ్యర్థి అంజిబాబు

భీమవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలో ఆదివారం పవన్ కల్యాణ్ రోడ్‌షో నిర్వహించారు. ప్రకాశం చౌక్‌లో నిర్వహించిన బహిరంగ సభకు మహిళలు, అభిమానులు, యువత తరలివచ్చారు. సభలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అంజిబాబు మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చెయ్యడమే తన లక్ష్యమన్నారు. ఈ నియోజకవర్గానికి పదేళ్లు ఎమ్మెల్యేగా పని చేశానని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. ఇక విశ్రాంతి తీసుకుందామనుకున్న సమయంలో పవన్ కళ్యాణ్ పిలిచారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలని అడిగారు. ఆయన నిజాయితీతో స్ఫూర్తి పొందాను. ఆయన కోసం ప్రపంచమే ఎదురు చూస్తున్నదన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు, మోదీల నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు మరో అవకాశం కల్పించాలని కోరారు. భీమవరం పట్టణంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు మాస్టర్ రింగ్‌రోడ్డు, తాగునీటి సమస్య పరిష్కరించేందుకు వాటర్ ట్యాంకులు నిర్మిస్తామని అంజిబాబు తెలిపారు.



నరసాపురంలో అభివాదం చేస్తున్న పవన్



టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్యకర్తలు

వైసీపీ విధానాల వల్లే టీడీపీలోకి వలసలు

▸ ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 21: వైసీపీ ప్రభుత్వ విధానాలు నచ్చక ఎంతో మంది ఆ పార్టీ కార్యకర్తలు టీడీపీ వైపు వలసలు వస్తున్నారని ఏలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఆదివారం స్థానిక అంజుమాన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎస్‌ఎం అక్బర్ ఆధ్వర్యంలో ముస్లిం, మైనార్టీలు వందలాదిగా టీడీపీలో చేరారు. 48వ డివిజన్ నుంచి పహీం, సలీం, విక్కీ ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి వలసలు వచ్చారు. 49వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నెరుసు గంగరాజు ఆధ్వర్యంలో జె.రాటాలు, కె.శివ తన అనునాయలతో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బడేటి క్యాంపు కార్యాలయంలో వారికి పార్టీ కండువాలను బడేటి చంటి వేసి సాదరంగా ఆహ్వానించారు.

రేపు నామినేషన్‌కు తరలిరావాలి..

బడేటి చంటి నామినేషన్ కార్యక్రమం ఈనెల 23న పురస్కరించుకుని బడేటి క్యాంపు కార్యాలయంలో సంబంధిత కరపత్రాలు ఆవిష్కరించారు. నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలంతా వేలాదిగా తరలి వచ్చి మద్దతు తెలపాలని చంటి కోరారు. ఆదివారం ఉదయం తాడేపల్లిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో టీడీపీ అదినేత చంద్రబాబునాయుడు నుంచి ఏలూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు బీఫారాన్ని స్వీకరించారు.

నేడు సొంగా రోషన్‌కుమార్ నామినేషన్



జంగారెడ్డిగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చింతలపూడి/జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 21: చింతలపూడి నియోజకవర్గ కూటమి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ సోమవారం ఉదయం 10.47 నిమిషాలకు చింతలపూడి ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా తరలిరావాలని జంగారెడ్డిగూడెం పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ, నాయకులు పెనుమర్తి రామ్‌కుమార్, పరిమి సత్తిపండు పిలుపునిచ్చారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ తొలుత ఉదయం ఏడు గంటలకు మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, తొమ్మిది గంటలకు రంగాపురం చేరుకుని సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి లింగపాలెం, ఫాతిమాపురం మీదుగా చింతలపూడి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ వేస్తారన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు చింతమనేని ప్రభాకర్ నామినేషన్

పెదవేగి, ఏప్రిల్ 21 : ఎన్డీయే కూటమి అభ్యర్థిగా దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సోమవారం ఉదయం నామినేషన్ దాఖలు చేస్తారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో ఉదయం తొమ్మిది గంటలకు భారీ ర్యాలీగా బయలుదేరి, ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్, పాతబస్టాండ్, ఆశ్రం ఆస్పత్రి మీదుగా దెందులూరు తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తారని పార్టీ నాయకులు తెలిపారు. టీడీపీతో పాటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని టీడీపీ నాయకుడు బొప్పన సుధాకర్ తెలిపారు.

నామినేషన్‌కు కార్యకర్తలంతా హాజరు కావాలి

లింగపాలెం, ఏప్రిల్ 21: లింగపాలెం మండలం నుంచి తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలంతా కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ నామినేషన్ కార్యక్రమానికి హాజరుకావాలని గరిమెళ్ళ చలపతిరావు అన్నారు. ఆదివారం లింగపాలెంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నాయకులంతా తమతమ గ్రామాల నుంచి తెలుగుదేశం, బీజేపీ, జనసేన కార్యకర్తలను నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు.

నేడు పవన్ సభను విజయవంతం చేయాలి

గణపవరం, ఏప్రిల్ 21: జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం గణపవరంలో జరిగే విజయభేరి ఎన్నికల సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, జనసేన మండల నాయకుడు తోట శ్రీనివాసరావు కోరారు. సోమవారం గణపవరం సెంటర్‌లో నాలుగు గంటలకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అధ్యక్షతన భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అభిమానులు, మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

క్రైం వార్తలు

తీర్థ యాత్రల కుటుంబంలో విషాదం

▸ బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తా.. ఒకరి మృతి

కె.గంగవరం, ఏప్రిల్ 21: తీర్థ యాత్రలకు బయలుదేరిన కుటుంబంలో విషాదం నెలకొంది. ఏలూరు జిల్లా లింగంపాలెం మండలం తిమ్మక్కపాలెం గ్రామానికి చెందిన నంద్యాల శ్రీనివాసరావు(27), తన సోదరి సుజాత, ఆమె కుటుంబ సభ్యులతో కలిసి తీర్థ యాత్రలకు బయలుదేరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది, అప్పనపల్లి, అయినవిల్లి, కోటిపల్లి దేవాలయాలను సందర్శించుకుని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆదివారం కోటిపల్లి నుంచి ద్రాక్షారామ భీమేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆటోలో వెళ్తున్నారు. కె.గంగవరం మండలం కుందూరు గ్రామం తాడిగొయ్యి సెంటర్‌లో ఆటోకు అడ్డంగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సుజాతకు, కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జానీ బాషా తెలిపారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వాట్సాప్ గ్రూపులో శిక్షణ పేరుతో సొమ్ములు స్వాహా

▸ బాధితుడి ఫిర్యాదుతో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 21 : మొబైల్‌లోని వాట్సాప్‌కు శిక్షణ గ్రూప్ అంటూ మెస్సేజ్ రావడంతో ఆ లింకును ఓపెన్ చేసి శిక్షణ పొందుతూ డిపాజిట్లు చేశారు. చివరకు అది నకిలీ గ్రూపు అని తెలిసి పోలీసులను ఫిర్యాదు చేయ డంతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు సమీపంలోని జోసఫ్‌నగర్‌కు చెందిన తేరా సందీష్ మొబైల్ ఫోన్‌కు గతనెలలో ఒక వాట్సాప్ మెస్సేజ్ వచ్చింది. శిక్షణ పొందుతూ ఇంటి నుంచే సొమ్ములు సంపాదించవచ్చని ఉండడంతో ఆ లింకును ఓపెన్ చేసి మార్చి 15 నుంచి ఈనెల 3వ తేదీ వరకు శిక్షణ పొందుతూ దఫదఫాలుగా రెండు లక్షల 40 వేల రూపాయలు డిపాజిట్ చేశారు. ఈనెల 8వ తేదీన ఆ గ్రూపు నకిలీదని సందీష్ గుర్తించి సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి వెంటనే సందీష్ పంపిన సొమ్ములలో లక్షా 10 వేల రూపాయలు ఫ్రీజ్ చేయగలిగారు. ఈ ఘటనపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రగడవరంలో రేషన్ బియ్యం పట్టివేత

చింతలపూడి, ఏప్రిల్ 21: చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామంలో నున్న రమేష్ అనేవ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు టన్నుల రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నట్టు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ జరీనా తెలిపారు. పక్కా సమాచారంతోనే దాడి చేశామని వాటిని స్వాధీనం చేసుకుని నిత్యావసర చట్టం కింద కేసు నమోదు చేశామని తెలిపారు.

90 లీటర్ల నాటుసారా స్వాధీనం



అచ్యుతాపురంలో సారా తయారీ కేంద్రంపై దాడి చేసిన పోలీసులు

కొయ్యలగూడెం, ఏప్రిల్ 21: 90 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ విష్ణువర్దన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి.. మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్నట్టు ఆదివారం సమా చారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి 90 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.





చింతలపూడిలో సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు.. టీడీపీలో చేరిన నాయకులతో చింతమనేని ప్రభాకర్

కూటమి విజయం ఖాయం

▸ ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 21: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం ఖాయమని, రాష్ట్ర పునఃనిర్మాణంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. ఆదివారం ఏలూరు 27వ డివిజన్‌లోని బాబూజగ్జీవన్ రామ్ కాలనీలో ప్రజాగళం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ నిరంకుశ పాలనతో ప్రజలంత విసిగిపోయారని అన్నారు. ఎన్నికల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో నష్టపోయిన వారందరికి కూటమి ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో యడ్లపల్లి శివ, బెజ్జం అచ్చాయమ్మ, తోటకూర చిట్టిబాబు, ఈ.నాగరాజు, కుమారరాజు, కొండపల్లి రాజు, టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమికే ఎమ్మార్పీఎస్ మద్దతు

చింతలపూడి, ఏప్రిల్ 21:కూటమి అభ్యర్థులకే ఎమ్మార్పీఎస్ పూర్తి మద్దతు అని రాష్ట్రనాయకులు రాజేశ్వర్, విస్సంపల్లి సిద్ధూ ప్రకటించారు. ఆదివారం చింతలపూడిలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాలుగు మండలాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరగాలంటే కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అవసరమన్నారు. గతంలో వర్గీకరణకు సహకరించింది చంద్రబాబే అన్నారు. ఫిబ్రవరి 6,7,8 తేదీల్లో సుప్రీం కోర్టులో ఎస్సీవర్గీకరణ వాదనలు జరిగితే రాష్ట్రప్రభుత్వం తరఫున న్యాయవాదిని నియమించడం కాని, వర్గీకరణపై జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడలేదని పేర్కొన్నారు. వర్గీకరణకు అనుకూలంగా ఉన్న పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈనెల 22న చింతలపూడిలో కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు, ఇన్‌చార్జిలు, మహిళలు, యువకులు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సీహెచ్ విజయ, సొంగా నక్షత్రం, మేరీ, నాగేంద్ర, సుగుణ, జుజ్జువరపు వాసు, మల్లికార్జున్, ముక్తేశ్వరరావు, అరుణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించడం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం అని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు.

గణనీయంగా టీడీపీలోకి పెరిగిన చేరికలు

పెదవేగి, ఏప్రిల్ 21 :ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పార్టీల్లో చేరుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చిన్నాన్న కుమారుడు భరత్ భూషణ్ శనివారం సోదరుడిని కాదని.. వైసీపీని వీడి చింతమనేని ప్రభాకర్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆదివారం ఉదయం పెదవేగి, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు తమ అనుచరగణంతో టీడీపీలో చేరారు. పార్టీలో చేరినవారికి కండువాకప్పి సాధరంగా ఆహ్వానించిన ప్రభాకర్ పార్టీలో చేరడంతో పాటు వచ్చే ఎన్నికల్లో మీ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు. ఏలూరు రూరల్ మాదేపల్లి -2 ఎంపీటీసీ సభ్యుడు గండికోట నాగరాజు తన అనుచరులతో కలిసి ఆదివారం చింతమనేని ప్రభాకర్ సమక్షంలో టీడీపీలో చేరారు.



పొగాకు గ్రేడింగ్ చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న చిర్రి బాలరాజు

ఎన్డీఏతోనే సమస్యల పరిష్కారం

▸ పోలవరం కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు

బుట్టాయగూడెం/కొయ్యలగూడెం, ఏప్రిల్ 21:ఎన్డీఏ కూటమి గెలుపుతోనే నియోజక వర్గంలో సమస్యలు పరిష్కారమవుతాయని జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. ఆదివారం బుట్టాయగూడెం మండలంలోని కొరెడ్లగూడెం, రామారావుపేట సెంటరు, సూరపవారిగూడెం, జగ్గిశెట్టిగూడెం, వీరన్నపాలెం, విప్పలపాడు, మర్రిగూడెం గ్రామాల్లో టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పొగాకు గ్రేడింగ్, శుభకార్యాలు జరుగు ప్రాంతాలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ప్రచారంలో భాగంగా కొరెడ్లగూడెంలోని కోదండ రామాలయం, షిరిడి సాయిబాబా ఆలయం, సూరపవారిగూడెంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొయ్యలగూడెం మండలంలోని గంగవరం, రాజవరం, గవరవరం పంచాయతీల్లో ఆయన ప్రచారం చేశారు. పోలవరం నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ భూములు పేదలకు పంచాలి

▸ సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య



అల్లంచర్లరాజుపాలెంలో అటవీ భూములను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

టి.నరసాపురం, ఏప్రిల్ 21 : అల్లంచర్లరాజుపాలెం రెవెన్యూ భూములను పేదలకు పంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అల్లంచర్లరాజుపాలెం పరిధిలోని గ్యాప్ ఏరియా భూములను సీపీఐ కామవరపుకోట నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించి మాట్లాడారు. అల్లంచర్లరాజుపాలెం ప్రాంతంలో దళారులు పెత్తందారులు పదుల సంఖ్యలో భూములు ఆక్రమించుకుని క్రయ విక్రయాలు సాగిస్తుంటే నోరుమెదపని అటవీ శాఖ అధికారులు కష్టజీవులైన నిరుపేదలు రెవెన్యూ భూమిని బాగు చేసి జీడి మొక్కలు నాటి సాగు చేస్తుంటే అక్రమ కేసులు బనాయించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫారెస్ట్ అధికారులు అటవీ శాఖకు చెందిన భూమి ఎంత, వాటి సరిహద్దులను సర్వే చేసి తెలుసుకోవాలని హితవు పలికారు. న్యాయబద్ధంగా ప్రభుత్వ భూములు పట్టాల పొంది సాగు చేసుకున్నటువంటి సాగుదారులపై చేస్తున్న దౌర్జన్యం ఆపకపోతే అటవీశాఖ అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సీపీఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, గొలిమే బాలయేసు, గదుల సత్యనారాయణ, శెట్టి నాగబాలాజీ, నల్లమోతుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విర్డ్ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ క్యాంప్



రోగులకు కాలిపర్స్ అందిస్తున్న డాక్టర్ శ్రీనాథ్

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 21: ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో ఆదివారం నుంచి ప్రారంభమైన ఆర్థోపెడిక్ క్యాంప్‌లో యుఎస్‌ఏ నివాసి డాక్టర్ శ్రీనాథ్ కామినేని పలువురు రోగులను పరీక్షించి వైద్యసేవలు అందించారు. ఈనెల 24 వరకు జరుగునున్న క్యాంప్‌లో భాగంగా యాభై మంది రోగులను పరీక్షించి, అనంతరం గుప్తా ఫౌండేషన్ సహకారంతో పది మంది దివ్యాంగులకు కాలిపర్స్, నలుగురికి కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఆసుపత్రి చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఆసుపత్రి ట్రస్టీలు ఐవీఆర్ సుధాకరరావు, నారాయణ మూర్తి, వైద్యులు కె.శ్రీనివాస్, భవ్యచంద్, హమీద్, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి, ఏవో ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

కొయ్యలగూడెం, ఏప్రిల్ 21:వాహన చోదకులకు వేసవి ఎండలు అధికంగా ఉండడంతో వాహనచోదకులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఆదివారం దిప్పకాయలపాడు గ్రామంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిలో వాహనచోదకులకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు అధికంగా ఉన్నందున తమ సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, గడా సుబ్బారావు, మోహన్, గడా రామయ్య బొమ్మా మోహన్ తదితరులు ఉన్నారు.

గ్రంథ పఠనంతో విజ్ఞానం పెంపు



పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, ఏప్రిల్ 21:గ్రంథ పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని పెదవేగి శాఖ గ్రంథాలయ గ్రంథ పాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగిలో శాఖ గ్రంథాల యంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం జరిగింది. పలువురు విద్యార్థులు గ్రంథాల యానికి వచ్చి, విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదివారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు అరుణ్‌కుమార్ గ్రంథ పఠనంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. నిత్యం గ్రంథపఠనం చేస్తే వారి భవిష్యత్ అభివృద్ధి బాట పడుతుందని, మంచి విజ్ఞానవేత్తగా ఎదుగుతారన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథపఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందని సూచించారు.

జనసేనలో చేరికలు



రెడ్డి అప్పలనాయుడును సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 21: స్థానిక జనసేన కార్యాలయంలో ఆదివారం రాత్రి ఏలూరులోని 12,13వ డివిజన్లకు చెందిన ప్రతినిధులు జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు సమక్షంలో జనసేనలో చేరారు. రాష్ట్ర మాలమహానాడు సెక్రటరీ సానాసి రమణ మిత్ర బృందం దాదాపు 30 మంది ఎస్సీ నాయకులు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండు వాలు వేసి ఆహ్వానించారు. అనంతరం రెడ్డి అప్పలనాయుడును సత్కరించారు. జనసేన నాయకులు నగిరెడ్డి కాశీనరేష్, పరిది రాజేష్, కందుకూరి ఈశ్వరరావు, రవి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

రాట్నాలమ్మకు ప్రత్యేకపూజలు



రాట్నాలమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెదవేగి, ఏప్రిల్ 21 : పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మ వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.40,135, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.22,350, ఫొటో విక్రయాల ద్వారా రూ.3595 ఆదాయం వచ్చిందని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.33,572 విరాళాలు అందించారన్నారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఈవో సతీష్‌కుమార్ పర్యవేక్షించారు.



ఏలూరు నగరేశ్వరాలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలంకరణ

నేడు నగరేశ్వరుని కల్యాణ మహోత్సవం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 21 :దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అగ్రహారంలోని గంగా వింధ్యవాసిని సమేత నగరేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి ఎనిమిది గంటలకు స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఈవో గుబ్బల రామపెద్దింట్లరావు తెలిపారు. తొలుత స్వామికి అమ్మవారికి ప్రత్యేకపూజలు అభిషేకాలు అర్చనలు, ఎదుర్కోల సన్నాహం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను పంచరంగులతో విద్యుత్‌దీపాల వెలుగులతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు.

సూర్యదేవాలయంలో అభిషేకాలు, అర్చనలు



అలంకరణలో ధన్వంతరి వైద్యభగవానుడు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 21 : చైత్రశుద్ధ త్రయోదశి సందర్భంగా పవర్‌పేటలోని ధన్వంతరి వైద్యభగవానుని ఆలయంలో ఆదివారం భక్తులు విశేషపూజలు, అభిషేకాలు, అర్చనలు, దీపారాధనలు నిర్వహించారు. సూర్యనమస్కార పూజలు జరిపారు. తొలుత భక్తులు ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి అర్చకుల నుంచి రక్షా బంధనాలు కట్టించుకున్నారు. వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు. భక్తి సంకీర్తనలను ఆ లపించారు. భక్తులతో ఆలయ ప్రాంతం కిటకిటలాడింది.

ఘనంగా అన్నసమారాధనలు



భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 21 : శ్రీరామనవమి ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో ఆదివారం పలుచోట్ల ఘనంగా అన్నసమారా. ధనలు జరిగాయి. నరసింహారావుపేట లోని దాసాంజనేయస్వామి ఆలయం, కట్టా సుబ్బారావువీధిలోని కోదండరామాలయం వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు మహాఅన్నసమారాధనలు నిర్వహించారు. గొల్లాయిగూడెంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉత్సవమూర్తులను మేళతాళాలతో భాజాభజంత్రీలతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆ సీటు ఎప్పుడూ ఖాళీనే..!



ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ సీటు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 21: ఆ సీటు ఎప్పుడూ ఖాళీగానే ఉంటుంది. లైట్లు వెలుగుతూనే ఉంటాయి, నిరంతరం ఫ్యాన్‌లు తిరుగుతూనే ఉంటాయి. అక్కడ అటెండర్‌ను ఈ సార్ ఎప్పుడు వస్తారని అడిగితే తెలియదు.. అవుట్‌డోర్‌లో ఉన్నారని సమాచారం వస్తుంది. అవుట్‌డోర్‌లో కూడా ఈ ఉద్యోగి ఎక్కడా కనిపించరనే విమర్శలున్నాయి. ఆయన ఎవరోకాదు నగర పాలక సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్. ఆయన అవుట్‌డోర్‌కు వెళ్లి కాంట్రాక్టర్లు నిర్మించే రోడ్లు, డ్రెయిన్లు ఇతర సివిల్ వర్కులు పరిశీలించరని సమాచారం. ఎవరూ లేని సమయంలో కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకుని బిల్లులు తయారు చేస్తారని.. కాంట్రాక్టర్ చేసే పనిలో నాణ్యత ఉందోలేదో పరిశీలించకుండా కమీషన్ ఇస్తే చాలు బిల్లులు తయారు చేస్తారనే ఆరోపణలున్నాయి. తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు చేయని పనులకు కూడా బిల్లులు తయారు చేసి ప్రజాధనాన్ని లూటీ చేస్తారని కొంతమంది కాంట్రాక్టర్లే ఆరోపిస్తున్నారు. ఈ ఉద్యోగిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం, ఏప్రిల్ 21 : రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్‌కు పరిధిలోని 11 కేవీ కొత్తగూడెం ఫీడర్ పరిధిలో ఈనెల 22 నుంచి 25 వరకు కరెంట్ సరఫరా ఉండదని జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున సరఫరా నిలిపివేస్తామని ప్రజలు సహకరించాలన్నారు.

రామాలయానికి శంకుస్థాపన



హరిజనవాడలో రామాలయ శంకుస్థాపన

చింతలపూడి, ఏప్రిల్ 21:ప్రగడవరం పంచాయతీ మాలపల్లిలో రామాల య నిర్మాణానికి గ్రామ రామ భక్త బృందం ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం జరిగింది. గతంలో మాలపల్లిలో వీరంతా గొంతేలమ్మ గ్రామదేవత గ్రామ పూజలు జరిపేవారు. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారామకల్యాణ ఉత్సవాలను జరుపుతున్నారు. ఈ ఏడాది రామాలయ నిర్మాణం చేపట్టాలని ఆదివారం గుడినిర్మాణానికి శంకుస్థాపన జరిపారు. కార్యక్రమంలో రామభక్త బృందం సభ్యులు, పలువురు పాల్గొన్నారు.

126 మందికి నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు జరుపుతున్న నిపుణులు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 21 : లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఉషా బాలకృష్ణ సహకారంతో ఆదివారం అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రవైద్యశాల నిపుణులు 126 మందికి కంటిపరీక్షలు జరిపి తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. 27 మందికి కళ్లజోళ్లు అందించారు. 17 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. శిబిరంలో బొలిశెట్టి సురేష్‌కుమార్, చెన్న వెంకట్రామయ్య సేవలందించారు.



అంబర్‌పేటలో కవాతు నిర్వహిస్తున్న పారామిలిటరీ సిబ్బంది

పోలీసుల కవాతు

భీమడోలు, ఏప్రిల్ 21 : సమస్యాత్మక గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భీమడోలు ఎస్‌ఐ సుధాకర్ అన్నారు. మండలంలోని వడ్లపట్ల, అంబర్‌పేట, పోలసానపల్లి గ్రామాలలో ఆదివారం సాయంత్రం పారా మిలటరీ సిబ్బందితో పోలీసు కవాత్ నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటా తిరిగి మిలిటరీ వర్గాలు ఆయా ప్రాంతాలను పరిశీలించారు.

ఫ్లాష్ బ్యాక్

ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు పశ్చిమగోదావరి, ప్రస్తుతం తెలంగాణలో ఉన్న ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట వంటి ప్రాంతాలు నూజివీడు సంస్థానంలో భాగంగా ఉండేది. దాదాపు 14 పరిగణాలుగా ఉన్న ఈ నూజివీడు సంస్థానం స్వాతంత్ర్య అనంతరం మూడు జిల్లాలుగా విభజితమైంది. అనంతరం ఈ సంస్థానం దాదాపు 20 నియోజకవర్గాలుగా విభజితమైంది స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లాలో నూజివీడు డివిజన్ (14 మండలాలతో) అతిపెద్ద డివిజన్‌గా ఉండేది. జాతీయ స్థాయిలో శాశించిన ప్రముఖులకు ఈ నూజివీడు నియోజకవర్గం జన్మభూమి అంటే అతిశయోక్తి కాదు. నూజివీడు కేంద్రంగా నూజివీడు సంస్థాధినేతగా పేరుగాంచిన మాజీ మంత్రి, ఆంధ్రా యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎమ్మార్ అప్పారావుతో పాటు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మాజీ రాజ్యసభ సభ్యులు దాసరి నాగభూషణరావు, రైతు సంఘం జాతీయ నాయకులు కొల్లి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు, మాజీ మంత్రి, దివంగత ఎమ్మెల్సీ పాలడుగు వెంకట్రావు వంటి దిగ్గజాలు ఈ నియోజకవర్గం వారే.



ప్రపంచ ప్రసిద్ధి..నూజివీడు మామిడి

ప్రపంచంలో ఏ మూలకువెళ్ళినా నూజివీడు మామిడికి ఉన్న చారిత్రక ప్రసిద్ధి మరువలేం. పచ్చని మామిడితోటలతో అలరాడే ఈ ప్రాంతం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత మెట్ట ప్రాంతం. ఈ ప్రాంతంలో మామిడి పరిశోధనా కేంద్రంతో పాటు ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాలతో ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం లభిస్తోంది. ప్రతి సీజన్‌లో అనేక వేలటన్నులు మామిడి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు తరలివెళుతోంది. దీంతో పాటు ఆధ్యాత్మిక ప్రాంతంగా ఈ ప్రాంతం అలరారుతోంది. ఆగిరిపల్లి శ్రీ వ్యాఘ్రలక్ష్మి నరసింహాస్వామి దేవస్థానం, మరోవైపు ముసునూరు మండలంలోని బలివే రామలింగేశ్వరస్వామి, నూజివీడు మండలంలోని గొల్లపల్లి రఘునాథ స్వామిదేవస్థానం, చాట్రాయి మండలం చనుబండ కోదండరామస్వామి దేవాలయం వంటి పురాతన దేవాలయాలు నూజివీడు ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకవస్తున్నాయి. దీంతోపాటు ఈ ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లు అనటంలో అతిశయోక్తి లేదు. నూజివీడు ప్రాంతం నుంచి బాస్కెట్‌బాల్,వాలీబాల్, టెన్నీకాయిట్ వంటి క్రీడాంశాల్లో ప్రావీణ్యం సాధించారు. ఏ ప్రాంతానికి వెళ్ళినా ఇక్కడి వారు ఉపాధి, ఉద్యోగ రంగాల్లో స్థిరపడిన వారిని చూడవచ్చు.



భారత స్వాతంత్ర్య సమరంలో నూజివీడు సంస్థానం ప్రముఖపాత్ర పోషించింది. ఉద్యమాల పురిటిగడ్డగా ఒకానొక దశలో కమ్యూనిజం భావాలతో భూదానోద్యమం కేంద్రంగా నిలిచింది. నూజివీడు నియోజక వర్గంలో నూజివీడు మున్సిపాల్టీతో పాటు ముసునూరు, ఆగిరిపల్లి, నూజివీడు మండలంతో పాటు పాత నియోజకవర్గంలో బాపులపాడు మండలంలోని కొన్ని ప్రాంతాలు అంతర్భాగంగా ఉండేవి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అనంతరం బాపులపాడు మండలంలోని గ్రామాలు గన్నవరం నియోజకవర్గంలో విలీనం కాగా తిరువూరు నియోజకవర్గం నుంచి చాట్రాయి మండలాన్ని నూజివీడు నియోజకవర్గంలో విలీనం చేశారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గం నాలుగు మండలాలు, ఒక మున్సిపాల్టీతో 2,37,139 మంది ఓటర్లను కలిగి ఉంది. ఇందులో పురుషులు 1,17,398 మంది కాగా, మహిళలు 1,19,730 మంది, ఇతరులు 11 మంది ఉన్నారు.
- నూజివీడు

ఉద్ధండుల కోట

మహామహులు ఏలిన నూజివీడు


నూజివీడు కోటగుమ్మం

అన్ని పార్టీలకు ఆదరణ

955 నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లాలో నూజివీడు నియోజకవర్గం అంత ర్యాగంగా ఉంది. ఈ నియోజకవర్గం దాదాపు అన్ని పార్టీలను సమానంగా ఆద రించిందని చెప్పవచ్చు. తొలితరం కాంగ్రెస్ పార్టీ నుంచి శాసనసభ్యులు ఎన్నిక కాగా తదుపరి తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తరువాత ఈ నియోజకవర్గం తెలుగుదేశానికి కంచుకోటగా ఉంది. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అనం తరం చాట్రాయి మండలం ఈ నియోజకవర్గంలో చేరడంతో కొన్ని రాజకీయ సమీకరణాలు మారి తిరిగి ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రాబల్యం పెరిగింది. దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి చనిపోయిన తరువాత కాంగ్రెస్ స్థానాన్ని ఇక్కడ వైసీపీ భర్తీ చేయడంతో వైసీపీ ప్రాబల్యం కనిపిస్తోంది. తొలిసారిగా నూజివీడు సంస్థానాదీశుడు అయిన మేకా రంగయ్య అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన 1955 నుంచి 1978 వరకు శాసనసభ్యుడిగా పనిచేయగా, ఈ కాలంలో ఆయన రాష్ట్రమంత్రిగా కూడా వ్యవహరించారు.

అనంతరం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కోటగిరి హనుమంతురావు ఇక్కడ చక్రం తిప్పారు. తొలుత 1983లో ఈయన ఇక్కడ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలిచి, తెలుగుదేశం పార్టీలో చేరారు. అక్కడి నుంచి ఆయన దాదాపు 15 సంవత్సరాల పాటు తెలుగుదేశం శాసన సభ్యుడిగా పనిచేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పాలడుగు వెంకట్రావు చక్రం తిప్పగా ఈయన సైతం రెండు పర్యాయాలు శాసన సభ్యుడిగా, ఒక పర్యాయం విధాన సభకు ప్రాతినిధ్యం వహించడమే కాక మంత్రిగా కూడా పనిచేశారు. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో కీలకపాత్ర వహించిన మేకా ప్రతాప్ తన రాజకీయ గురువు అయిన కోటగిరి హనుమంతురావుతో విభేదించి 1994లో తొలిసారి ఇక్కడి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి శాసనసభ్యునిగా గెలుపొందారు.అనంతరం వైసీపీలో చేరి వరుసగా రెండుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. దాదాపు 15 సంవత్సరాల పాటు శాసనసభ్యుడిగా కొనసాగారు. మధ్యలో 2009లో ఒకసారి తెలుగుదేశం పార్టీ నుంచి డాక్టర్ చిన్నం రామకోటయ్య ఇక్కడి నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. నూజివీడు సంస్థానాదీశుడు ఎమ్మార్ అప్పారావు అత్యధికకాలం 22 సంవత్సరాల పాటు శాసన సభ్యునిగా కొనసాగగా, చిన్నం రామకోటయ్య మినహా మిగిలిన వారు దాదాపు మూడుసార్లు ఇక్కడి నుంచి అధికారంలో ఉన్నారు.

నూజివీడు నియోజకవర్గ వ్యాప్తంగా 286 పోలింగ్ స్టేషన్లు ఉండగా, నూజివీడు మున్సిపల్ పరిధిలో 48, నూజివీడు రూరల్ మండలపరిధిలో 71, ముసునూరు మండలపరిధిలో 57, చాట్రాయి మండలపరిధిలో 51, ఆగిరిపల్లి మండలపరిధిలో 59 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. నూజివీడు నియోజకవర్గ పరిధిలో మొత్తం పోలింగ్‌స్టేషన్లు 286గా ఉంది.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	ప్రత్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
1955	మేకా రంగయ్య అప్పారావు	ఏకగ్రీవం				
1962	మేకా రంగయ్య అప్పారావు	కాంగ్రెస్	35,244	దాసరి నాగభూషణరావు	సీపీఐ	21,235
1967	మేకా రంగయ్య అప్పారావు	కాంగ్రెస్	36,468	తిరువూరు మధుసూదన్‌రావు	స్వతంత్ర	28,294
1972	మేకా రంగయ్య అప్పారావు	కాంగ్రెస్	36,689	మాదల వెంకటేశ్వరరావు	స్వతంత్ర	27,564
1978	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	40,524	విద్యుత్ కుమార్ అప్పారావు	ఆర్-కాంగ్రెస్	37,270
1983	కోటగిరి హనుమంతురావు	స్వతంత్ర	30,267	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	25,924
1985	కోటగిరి హనుమంతురావు	టీడీపీ	50,282	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్)	46,688
1989	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	60,378	మేకా రంగయ్య అప్పారావు	టీడీపీ	56,784
1994	కోటగిరి హనుమంతురావు	టీడీపీ	63,202	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	50,377
1999	కోటగిరి హనుమంతురావు	టీడీపీ	46,139	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	42,670
2004	మేకా ప్రతాప్ అప్పారావు	కాంగ్రెస్	80,706	కోటగిరి హనుమంతరావు	టీడీపీ	61,499
2009	చిన్నం రామకోటయ్య	టీడీపీ	70,206	మేకా ప్రతాప్ అప్పారావు	కాంగ్రెస్	65,063
2014	మేకా ప్రతాప్ అప్పారావు	వైసీపీ	95,565	ముద్దరబోయిన వెంకటేశ్వరరావు	టీడీపీ	85,168
2019	మేకా ప్రతాప్ అప్పారావు	వైసీపీ	1,01,950	ముద్దరబోయిన వెంకటేశ్వరరావు	టీడీపీ	85,740


అడుగంటిన నీటిని తోడుతున్న విద్యుత్ మోటారు

అడుగంటిన నీరే తాగునీటి చెరువుల్లోకి!

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 21: కాల్వలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేసినప్పటికి చెరువులు నింపుకోవడానికి సమయం సరిపోకపోవడంతో అధికశాతం చెరువులకు పూర్తిస్థాయిలో నీటిని నింపుకోలేదు. కాలువలకు కొద్దిరోజులు మాత్రమే నీటిని విడుదల చేసి తరువాత నీటిమట్టాలను క్రమేపి తగ్గించి వేయడంతో కాలువలు పూర్తిగా అడుగంటిపోయాయి. పోల్రాజ్ కెనాల్ పూర్తిగా అడుగంటడంతో అడుగంటిన నీటిని శ్రీహరిపురం తాగునీటి చెరువుకు మోటార్‌తో పంపింగ్ చేస్తున్నారు. నిల్వ నీటిని తాగునీటి చెరువుకు పంపింగ్ చేస్తే ఆ నీరు తాగేందుకు ఉపయోగపడుతుందా అని అధికారులు ఆలోచించ కుండా చెరువు నింపాలన్న ఉద్దేశంతో ఏదో ఒక నీటిని నింపి వేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని 10 రోజులు సరఫరా చేయకపోవడంతో అరకొరగానే తాగునీటి చెరువులను నింపాల్సి వచ్చిందని గ్రామ కార్యదర్శులు వాపోతున్నారు.

సెమీఫైనల్స్‌కు వైజాగ్, అనంతపురం జట్లు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 21: నూజివీడులో జరుగుతున్న రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బాలుర విభాగంలో వైజాగ్, అనంతపురం జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరాయి. మొదటి క్వార్టర్ ఫైనల్లో కర్నూలు, వైజాగ్ జట్లు తలపడగా 55-57 స్కోరుతో కర్నూలుపై వైజాగ్ జట్టు విజయం సాధించి సెమీఫైనల్స్‌కు చేరింది. రెండో క్వార్టర్ ఫైనల్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడగా 47-28 స్కోరుతో నెల్లూరుపై అనంతపురం జట్టు విజయం సాధించి, సెమీఫైనల్స్‌కు చేరింది.

చంద్రబాబు జన్మదిన వేడుకలు



చాట్రాయి, ఏప్రిల్ 21: మండలంలోని చిన్నంపేటలో టీడీపీ లీగల్‌సెల్ జిల్లా కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, కోటపాడులో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మంచిన పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేకులు కట్ చేసి, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోరంపూడి నరసింహారావు, బొంతు బ్రహ్మాజీ, వేముల నాగేశ్వరరావు, బెనర్జీ, పుల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి కుమార్తెలకు బంగారు నాణేలు

చాట్రాయి, ఏప్రిల్ 21: చాట్రాయి పాల సహకార సంఘం సభ్యుడు కొండపల్లి మహేశ్వరరెడ్డి కుమార్తె దివ్యశ్రీ, తుమ్మగూడెం పాల సంఘం సభ్యురాలు బొలికొండ తులసి కుమార్తె భవానీ వివాహాల సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద ఒక్కొక్కరికి రూ. 20 వేల విలువైన బంగారు నాణేలను ఆదివారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి అందజేశారు. సంఘాల అధ్యక్షులు కుప్పిరెడ్డి వసంతరెడ్డి, మండలపు పద్మావతి, రూట్ సూపర్‌వైజర్ శివ నాగేశ్వరరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

30 వ్యవసాయ బోర్ల సామగ్రి చోరీ

ముసునూరు, ఏప్రిల్ 21: మండలంలో వ్యవసాయ బోర్లకు సంబంధించిన విలువైన సామగ్రి చోరీలు రోజురోజుకు పెరుగుతున్నాయి. రైతులు ఫిర్యాదు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. గోపవరం శివారు పెద్దపాటివారిగూడెంలో వ్యవసాయ బోర్ల సామగ్రి చోరీ జరిగి 15 రోజులు గడవక ముందే శనివారం రాత్రి సుమారు 30 మంది రైతుల వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్లు, స్టార్టర్లు, ఫ్యూజుల్లో రాగివైరు చోరీ అయ్యాయి. వీటి విలువ రూ. 2 లక్షలు ఉంటుందని బాధిత రైతులు మాకినేని నాగార్జున, వెలగపూడి గంగాధరరావు, ఉండవల్లి కిరణ్‌కుమార్ తదితరులు తెలిపారు. ఈ చోరీలపై బాధిత రైతులు ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్ప టికైనా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని బాధిత రైతులు కోరారు.

మద్యం స్వాధీనం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 21: సెబ్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 30 లీటర్ల సారా, 40 బాటిళ్ళ మద్యాన్ని స్వాధీన పరుచుకున్నట్లు నూజివీడు సెబ్ సీఐ వెంకటరమణ తెలిపారు. పర్వతాపురం చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో బైక్‌పై సారా తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో నూజివీడు మండలం సుంకొల్లుకు చెందిన వల్లెపు తిరుపతిరావు, సుంకర నాగ వడ్డికాసులను అదుపులోకి తీసుకుని ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నూజివీడు మండలం అన్నవరం గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న గుండుబోయిన శ్రీహరి అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.



జడ్పీటీసీ విజయనిర్మల దంపతులను, కైకలూరు సర్పంచ్ నవరత్నకుమారిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కామినేని

వైసీపీకి దెబ్బ మీద దెబ్బ

టీడీపీలో చేరిన మండవల్లి జడ్పీటీసీ ముంగర దంపతులు ▸ కైకలూరు సర్పంచ్ నవరత్నకుమారి.. ఇంకా పలు కుటుంబాలు టీడీపీ తీర్థం

కైకలూరు, ఏప్రిల్ 21: ఎన్నికల సంగ్రామం ప్రారంభమైనప్పటి నుంచి కైకలూరు నియోజకవర్గంలో వైసీపీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఇటీవల కైకలూరు జడ్పీటీసీ కురేళ్ళ బేబి వైసీపీని వీడి టీడీపీలో చేరగా ఆదివారం కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండవల్లి జడ్పీటీసీ ముంగర విజయనిర్మల, తన భర్త మల్లికార్జునరావుతో సహా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో నాలుగు మండలాల జడ్పీటీసీలలో రెండు మండలాల జడ్పీటీసీలు కూటమి గూటికి చేరడంతో కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ భర్త మల్లికార్జునరావు మాట్లాడుతూ వైసీపీలో జడ్పీటీసీగా గెలుపొందినప్పటికీ ఎమ్మెల్యే తనను అన్ని విధాలా వేధించారని, సభలు, సమావేశాల్లో సైతం ప్రాధాన్యత ఇవ్వకుండా ఒంటెద్దు పోకడలతో తనను, తన భార్యను అవమానించారన్నారు. అందువల్లే కూటమిలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కొల్లేరు ప్రజలు సైతం కూటమికి అండగా ఉండేలా తన వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ వైసీపీ నుంచి ఇద్దరు జడ్పీటీసీలు టీడీపీలో చేరడం శుభపరిణామమని రెట్టించిన ఉత్సాహంతో కార్యకర్తలు తనను ఎమ్మెల్యేగా గెలిపించడంతో పాటు ఎంపీగా పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను పార్లమెంటుకు పంపించాలన్నారు. వదర్లపాడు వైసీపీ సర్పంచ్ కుమారుడు వడుపు ప్రసాద్‌బాబు, 200 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసు రాజు, టీడీపీ నాయకుడు బీకేఎం నాని, కొల్లేరు అభివృద్ధి సంఘం నాయకులు ముంగర ఏడుకొండలు, వదర్లపాడు గ్రామానికి చెందిన పులి బుజ్జి, పెరుగు భానుప్రకాష్, పెద్దిశెట్టి గోపి, పుప్పాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న కైకలూరు వైసీపీ సర్పంచ్

కైకలూరు వైసీపీ సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి ఆదివారం రాత్రి కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, టీడీపీ జోన్-2 కన్వీనర్ మండలపు దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని తమను ఉత్సవ విగ్రహంలా కుర్చోపెట్టారన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కూడా కల్పించలేదని ఆమె వాపోయారు. జడ్పీటీసీ కురేళ్ళ బేబి, మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో 200 మంది కూటమిలో చేరిక

కలిదిండి: కూటమి అధికారంలోకి వస్తే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పోతుమర్రు, గొల్లగూడెం, కొండూరు, ఆరుతెగలపాడు, చింతలమోరు, కాళ్లపాలెం గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించి తనకు కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వెంకటాపురం గ్రామానికి చెందిన వైసీపీ యువత కోలా శ్రీకాంత్, కోలా మురళి, పుప్పాల మణికంఠ, రామదాసు, నాగరాజు, పంచకర్ల ముసలయ్య, తోరం సాయి, ఏసుబాబు, పంచకర్ల రాజు, కనపర్తి నాగూర్ బాబు, పంచకర్ల బాజీ బాబు, సుంకర హరీష్, భోగేశ్వరరావుతో పాటు 200 మంది కామినేని సమక్షంలో కూటమిలో చేరారు. వీరికి కామినేని పార్టీ కండువాలు కప్పి కూటమిలోకి ఆహ్వానించారు.

వైసీపీ నుంచి 60 కుటుంబాల చేరిక

మండవల్లి: కానుకొల్లు ఎస్సీ కాలనీ, అల్లినగరం, గున్ననపూడి గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలు 60 కుటుంబాలు టీడీపీలో టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కొడాలి వినోద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ వైసీపీ పాలనలో విసుగుచెంది ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు కూటమి వైపు చూస్తున్నారని వీరి ఆర్థిక ఎదుగుదలకు టీడీపీ ప్రభుత్వంలో తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, లింగాల సర్పంచ్ బోయిన సురేష్, గ్రామపార్టీ అధ్యక్షుడు విష్ణుమూర్తుల రాంబాబు, బూత్ కన్వీనర్ కోసూరి మాణిక్యాలరావు, మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ రకీబా, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పాముల జోసఫ్ తంబి, పంతగాని సురేష్, మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

అంకమ్మ వారికి పార్థసారథి పూజలు



ఆగిరిపల్లి, ఏప్రిల్ 21: ఆగిరిపల్లి గ్రామ ఉలాస వారి ఇలవేల్పు అంకమ్మ వారికి నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి పూజలు చేశారు. విజయవాడలో చంద్రబాబు చేతుల మీదుగా బీఫాం తీసుకుని నేరుగా అంకమ్మ ఆలయానికి వచ్చి పూజలు చేశారు. అనం తరం ఆగిరిపల్లి నగర సామాజికవర్గ నాయకుడు రాణిమేకల వెంకట నరుసు భార్య మృతి చెందగా ఆయనను పరామర్శించారు. మరో శుభకార్యానికి కూడా ఆయన హాజరయ్యారు.

వైభవంగా రఘునాథస్వామి కల్యాణం



నూజివీడు టౌన్, ఏప్రిల్ 21: ప్రసిద్ధ గొల్లపల్లి రఘునాథ స్వామి కల్యాణాన్ని ఆలయ ప్రధానార్చ కులు సంతోష్, రోహిణికుమార్, చక్రవర్తుల కృష్ణమాచార్యులు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు గజవాహనంపై ఎదుర్కోలు ఉత్సవాన్ని, కల్యాణం అనంతరం అశ్వవాహనంపై గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అన్నసమా రాధన జరిగింది.

కన్నుల పండువగా పవళింపు సేవ

చాట్రాయి, ఏప్రిల్ 21: అపర భద్రాద్రి చనుబండ కోదండ రామాలయంలో శనివారం రాత్రి స్వామివారి పవళింపుసేవ కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల విగ్రహాలను పల్లకిలో ఉంచి, జైశ్రీరామ్ నినాదాలతో ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. అనంతరం పవళింపుసేవ నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి పూలు, మిఠాయిలు సుగంధ ద్రవ్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు పంపిణీ చేసింది.

ఓటర్లలో చైతన్యం కోసం..



చాట్రాయి, ఏప్రిల్ 21: ఓటు హక్కు మాత్రమే కాదు.. బాధ్యత కూడా.. అనే నినాదంతో అధికార యంత్రాంగం చాట్రాయి సచివాలయం, రక్షిత మంచినీటి పథకం వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, నూజివీడు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో భవానీ శంకరి జారీ చేసిన ఈ ఫ్లెక్సీలో ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఆమోదించిన గుర్తింపు పత్రాల వివరాలు, కంట్రోల్ రూమ్ నంబర్లు, పోలింగ్ తేదీ ముద్రించి ఉన్నాయి. దారిన వెళ్ళేవారు ఫ్లెక్సీల వద్ద ఆగి చదివి వెళుతున్నారు.


సరోజిని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నితిన్‌కృష్ణ, నాయకులు

దేవినేని సరోజినికి ఘన నివాళి

ముసునూరు, ఏప్రిల్ 21: టీడీపీ మండల అధ్యక్షుడు దేవినేని ధలరాం తల్లి సరోజిని పెదకర్మ సందర్భంగా నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి తనయుడు నితిన్ కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తుమ్మల లక్ష్మణరావు, తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లాల న్యాయవాది కోగంటి సాయి, తెలుగు యువత నాయకుడు గద్దె రఘుబాబు, మానురాజు సురేష్, కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి), యలమంచల శ్రీకాంత్, పాకనాటి సీతారామ్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

అనాథ బాలికలతో ఎన్నికల ప్రచారంపై విచారణ

నూజివీడు, ఏప్రిల్ 21: నూజివీడు వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు అనుకూలంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనాథ బాలికల వ్యవహారంపై ఆదివారం అధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం రాత్రి నూజివీడు మండలం పాతరావిచర్ల గ్రామంలో అనాథ బాలికలకు వైసీపీ జెండాలు కప్పి తలకు టోపీలు పెట్టి వైసీపీ కార్యకర్తల్లా వారితో వైసీపీ నాయకుడు బసవరాజు నగేష్ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేయించారు. ఆ రోజు గ్రామంలో అభ్యర్థి ప్రతాప్ ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ విషయం వెలుగులోకి రావడం, జనసేన నాయకులు ఎన్నికల అధికారిణి అయిన ఆర్డీవో వై.భవానీశంకరికి శనివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఆమె విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా ఆదివారం ఉదయం నూజివీడు పురపాలక కమిషనర్ రామిరెడ్డి, పురపాలక అధికారి నాగరాజు, బసవరాజు నగేష్, స్నేహ రైడ్స్ పేరుతో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహానికి వెళ్ళి విచారణ నిర్వహించారు. నివేదికను ఆర్వోకు సమర్పిస్తామని వారు తెలిపారు.

కూటమితోనే గ్రామాల అభివృద్ధి

కలిదిండి, ఏప్రిల్ 21: వైసీపీ పాలనలో గ్రామాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని, కాలువలకు తాగునీరు వదిలినా ఇంకా గ్రామాల్లో నిండలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే రోడ్లు వేయిస్తామని, మౌళిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు నామినేషన్‌కు తరలిరండి..

కైకలూరు, ఏప్రిల్ 21: ఈ నెల 23వ తేదీ ఉదయం 10.48లకు కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నానని డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఉదయం కైకలూరు మండలం వరహాపట్నంలోని తన స్వగృహం నుంచి అభిమానులు ర్యాలీ మధ్య నామినేషన్‌కు వెళ్తున్నట్లు తెలిపారు. వరహాపట్నం నుంచి రాచపట్నం, గోపవరం మీదుగా కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయం, మెయిన్‌రోడ్డు మీదుగా మార్కెట్ రోడ్డు నుంచి బైపాస్‌రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి భారీ ర్యాలీగా వెళతామని వేలాది మంది కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కామినేని నామినేషన్‌కు భారీగా తరలిరావాలంటూ కైకలూరు మండలం గోపవరం, రాచపట్నం, సీతనపల్లి, దొడ్డిపట్ల, రామవరం, వదర్లపాడు, నరసాయిపాలెం గ్రామాల్లో టీడీపీ నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, పి. రామచంద్రరావు, కేకే బాబు, పి. రాధాకృష్ణ, వి.సుధా, పడమటి వాసు తదితరులు పర్యటించి కార్యకర్తలు, నాయకులను ఆహ్వానించారు.

ముదినేపల్లి: కామినేని శ్రీనివాస్ నామినేషన్‌కు ముదినేపల్లి మండలం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, అభిమానులు తరలి రావాలని నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ కోరారు. ఆదివారం ముదినేపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన ఈ మేరకు పిలుపునిచ్చారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ.. కమ్మిలి పూజలు

కలిదిండి, ఏప్రిల్ 21 : మండలంలో కోరుకొల్లులో వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు దంపతులు పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన జరిగింది. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ అంకెం నరసయ్య, రిటైర్డు ఎస్పీ చెన్నంశెట్టి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్టు వితరణ



కలిదిండి, ఏప్రిల్ 21 : ఆరుతెగలపాడు జడ్పీ హై స్కూల్ విద్యార్థులకు ఆది వారం అఖిల భారత యాదవ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూరుబోయిన శ్రీనివాసరావు వాలీబాల్ కిట్టు వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. పేద విద్యార్థులకు తన వంతు సాయమందిస్తానన్నారు.

గర్భిణికి ఆర్థిక సాయం

ముసునూరు, ఏప్రిల్ 21: ముసునూరు సగరుల పేటలో పేద కుటుంబానికి చెందిన పేరుచర్ల నాగేశ్వరమ్మ అనే గర్భిణికి టీడీపీ యువనేత పాకనాటి సీతారామ్ ఆదివారం రూ. 5 వేలు ఆర్థిక సాయం చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ గారపాటి నరసింహారావు పాల్గొన్నారు.

ఇంటి నుంచి ఓటు వేసే వారి వివరాల సేకరణ

ముదినేపల్లి, ఏప్రిల్ 21 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో ఇంటి నుంచే ఓటు వేసేందుకు అర్హులైన ఓటర్ల వివరాలను ముదినేపల్లి మండలంలో సేకరిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.లక్ష్మీ నరసకుమారి తెలిపారు. మండలంలోని ఆరు క్లస్టర్ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో 85 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులు, అనారోగ్యంతో మంచం పట్టిన ఓటర్ల వివరాలను తీసుకుంటున్నట్లు తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగ ఓటర్లకే ఇంటి నుంచి ఓటు చేసే అవకాశం కల్పిస్తామని తహసీల్దార్ కుమారి తెలిపారు.

గూడవల్లికి పూర్వ విద్యార్థుల అంతిమ వీడ్కోలు

ముదినేపల్లి, ఏప్రిల్ 21 : ముదినేపల్లిలో ఆదివారం హైస్కూలు రిటైర్డ్ హెచ్ఎం గూడవల్లి వెంకటేశ్వరరావు అంతిమ యాత్రలో పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు, అభిమానులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ముదినేపల్లి ఉప సర్పంచ్ ఈడే సుధాకర్, అల్లాడి సతీష్, మరీదు రాఘవ, పొట్లూరి సతీష్, పసుపులేటి శ్రీనివాసరావు, గ్రామస్థులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.